Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక : 303 పేజీలు 8 వెల : 5 శుక్రవారం 04 ఏప్రిల్ 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజీ |
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఫ్రంట్ పేజీ : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

విద్యార్థులకు అండగా ఉంటామన్న రఘునందన్

2లో..



# వైకాపా కుటిల రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి

పాస్టర్ ప్రవీణ్ మరణంపై దమారమే ఇందుకు నిదర్శనం

పల్లె నిద్రతో ప్రజా సమస్యలు గుర్తించండి

కేబినేట్ భేటీ తరవాత మంత్రులతో సిఎం చంద్రబాబు

అమరావతి: రాజకీయ లబ్ది కోసం బట్టకాల్చి మీద వేసే చర్యలకు వైకాపా దిగుతోందని, ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రులను సిఎం చంద్రబాబు హెచ్చరించారు. అలాగే పల్లె నిద్రతో ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఇకపోతే పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైసీపీ చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేబినెట్ సమావేశం అనంత రం మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయిన సీఎం.. పలు రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ప్రవీణ్ మరణానికి సంబంధించి సీసీ కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. మనం అప్రమత్తంగా లేకుంటే.. బాబాయ్ గొడ్డలి, కోడికత్తి, గులకరాయి తరహాలో అన్నీ మనపైనే వేస్తారని అన్నారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడదా మని మంత్రులకు సీఎం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఆప్కాస్ ద్వారా దుర్వినియోగం చేసిందని విమర్శించారు. విచ్చలవిడి నియామకాలతో వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఒక టీటీడీలోనే 4వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సరైన విధివిధానాలు అవసరమన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఔట్ మిగతా 2లో



# పవన్ కళ్యాణ్‌తో నాగబాబు భేటీ

### అన్నకు శుభాకాంక్షలు తెలిపిన తమ్ముడు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను గురువారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వీరిద్దరూ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే, ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నాగబాబుకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబు.. ఏప్రిల్ 2వ తేదీ నాడు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం నాడు మధ్యాహ్నం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం

చేసిన నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ విధాన పరిషత్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన తమ్ముడు నాగబాబుకి అన్నయ్య, వదిన ఆత్మీయ అభినందనలు, ఆశీస్సులు తెలియజేస్తున్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.



## థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ

2లో..



# మంగళగిరిని అద్భుతంగా అభివృద్ధి చేస్తా

క్రమంగా వరుసగా అభివృద్ధి కార్యక్రమాలు

ఉండవల్లిలో మన ఇల్లు -మన లోకేష్ కార్యక్రమం

దంపతులకు తొలిగా శాశ్వత నివాస పట్టా అందచేత

అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని లోకేశ్ హామీ

2లో..

# హైకోర్టులోనూ కొనసాగిన విచారణ



### 7వతేదీకి వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. 400 ఎకరాల్లో చెట్ల నరికివేత పనులు ఆపాలని దాఖలైన పిటిషన్లపై హైకోర్టు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు విచారణను ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని ఆదేశించిన కోర్టు.. అప్పటిలోగా కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేసేందుకు ఏజీ హైకోర్టును గడువు కోరారు. ఈ మేరకు కోర్టు కేసును వాయిదా వేసింది. ఇదిలా ఉండగా.. ఈ భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టులోనూ విచారణ జరిగిన విషయం తెలిసిందే. సెంట్రల్ యూనివర్సిటీ వద్ద మిగతా 2లో

# గచ్చిబౌలి భూములపై ప్రభుత్వానికి షాక్

చెట్ల నరికివేతపై ధర్మాసనం సీరియస్

చట్టాన్ని ఎలా చేతుల్లోకి తీసుకుంటారు

ఎలాంటి పనులు చేపట్టవద్దన్న సుప్రీం ధర్మాసనం



న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మాసనం.. ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దంటూ స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా

తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ ధర్మాసనం సీరియస్ అయ్యింది. మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీన్ని చాలా సీరియస్ అంశంగా పరిగణించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని మండిపడింది. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. అలాగే మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు అమికస్ క్యూరీ పరమేశ్వర్ ఉంచగా.. వాటినీ పరిశీలించింది. కాగా, ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సుప్రీంకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఇంత అత్యవసరంగా భూముల్లో చెట్లు- తొలగించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న నియమించిన కమిటీలోని అధికారులు సైతం సమాధానం చెప్పాలని హుకుం జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటు-ందని తెలిపింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా.. చెట్లు కొట్టేసే

# పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు



ముగిసిన ఇరుపక్షాల వాదనలు

తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం ధర్మాసనం

2లో..

# రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు



సభలో ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

సుదీర్ఘ చర్చ అనంతరం ఓటింగ్

బిల్లు రాజ్యాంగంపై దాడి అన్న సోనియా

2లో..



# 400 ఎకరాల్లో చెట్ల నరికివేతపై స్టే

సుప్రీం తీర్పు కనువిప్పు కావాలి

మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలకు ఇది చెంపపెట్టు లాంటిది అని తెలిపారు. నిన్న పార్టీ ఫిరాయింపుల విషయంలో మొట్టికాయలు, నేడు హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం అక్షింతలు వేసిందన్నారు. అధికారం ఉంది కదా అని ఏది పడితే అది చేస్తామంటే, చట్టం చూస్తూ ఊరుకోదు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందినపుడు న్యాయస్థానం మార్గదర్శకంగా ఉండడం శుభ పరిణామం. ఇది విద్యార్థుల విజయం, పర్యావరణ ప్రేమికుల విజయం, సామాజిక వేత్తల విజయం. హెచ్‌సీయూ భూములు కాపాడుకునేందుకు ఎంతగానో పోరాటం చేసిన విద్యార్థులకు, తెలంగాణ మిగతా 2లో

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు



**హైదరాబాద్:** హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని బిజెపి ఎంపి రఘునందన్ రావు అన్నారు. ఓవైపు విద్యార్థులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు- కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది. ఒక్క చెట్టు- కొట్టడానికే అనుమతి అవసరమైతే.. వందల చెట్లు ఎలా కొట్టారు? మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని అనుకున్న ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ వంటిదని రఘునందన్ పేర్కొన్నారు.

## థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు- థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

న్యూఢిల్లీ :తెలంగాణలో పార్టీ మారిన పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ పూర్తయ్యింది. సుప్రీం తీర్పును రిజర్వ్ చేసింది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై గురువారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. స్పీకర్ తరపున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరపున సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ కార్యదర్శి తరపున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని అన్నారు. అలాగే రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత ఆ అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీంతో అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. ఈ క్రమంలో మణిపూర్ వ్యవహారం, రాణా కేసుతో పాటు మరికొన్ని అంశాలను అభిషేక్ సింఘ్వి కోర్టుకు వివరిస్తూ వాదనలు ముగించారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో.. పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. మహారాష్ట్ర వ్యవహారం సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు. సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ తప్పక తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో పేర్కొందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రస్తావించారు. దీనిపై న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం చెప్పారు. ధర్మాసనం కూడా తాము ఆ విషయంలోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ పిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టులో ముగిసింది. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

# మంగళగిరిని అద్భుతంగా అభివృద్ధి చేస్తా



**గుంటూరు:** యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం ఉండవల్లిలో సీతామహాలక్ష్మికి మంత్రి నారా లోకేష్ ఇంటి పట్టా అందించారు. గురువారం మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మి దంపతులకు ఉండవల్లిలో తొలి శాశ్వత ఇంటి పట్టాను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పం, హిందూపూర్ లాగా మంగళగిరిని టిడిపి కంచుకోటగా నిర్మిస్తానని అన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ ఉచితంగా ఇంటి పట్టాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న చోటే పట్టాలు ఇవ్వాలని కోరారు.. మొదటి విడతగా మూడు వేల మందికి ఇంటి పట్టాలు ఇస్తున్నామన్నారు. అయితే, తాను మొదటిసారి మంగళగిరిలో పోటీచేసి ఓడిపోయా.. మొదటి రోజు బాధపడినా మరుసటి రోజు నుంచి ప్రజల మనసులు గెలవాలని పని చెయ్యడం మొదలు పెట్టానని మంత్రి లోకేష్ వెల్లడించారు. 2024లో నన్ను గెలిపించాలని కోరా.. ఎవరూ ఊహించని విధంగా రికార్డు మెజారిటీతో నన్ను గెలిపించారు అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి పేరుతో దేశంలో ఈ నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా తయారు చేయాలని పని చేస్తున్నాను.. మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరిలో అత్యంత ఆధునిక వసతులతో వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తాం.. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతానని అన్నారు. మంగళగిరి చేనేతలు, స్వర్ణకారుల కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపడతామని నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జేసీబీ పాలన పోయి పేదలకు పట్టాలిచ్చే ప్రభుత్వం వచ్చిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10నెలల్లో మంగళగిరిలో తొలి పట్టాకు శ్రీకారం చుట్టామన్నారు. లోకేష్ గెలిస్తే మంగళగిరిలో ఉన్న ఇళ్లు పీకేస్తారంటూ చేసిన అసత్య ప్రచారం నోర్లు 10 నెలల్లో మూయించామని తెలిపారు. మూడు దశల్లో అన్ని సమస్యలు పరిష్కారం చేసి తీరుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే కీలక హామీ మంగళగిరి నుంచి ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తొలిదశలో 3 వేల మందికి మంగళగిరిలోనే ఇళ్ల పట్టాలు, బట్టలు పెట్టి మరీ అందిస్తున్నామన్నారు. అధికారంలో లేనప్పుడే సొంత ఖర్చులతో 26 సంక్షేమ పథకాలు అందచేశామని అన్నారు. స్వచ్ఛ మంగళగిరి పేరిట స్వచ్ఛతలో మంగళగిరి దేశంలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. ఇటీ-వల మంత్రివర్గంలో ఆమోదం పొందిన 100 పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో 50కి పైగా పథకాలు మంగళగిరిలో అమలయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. అన్ని రంగాల్లో మంగళగిరిని నెంబర్ 1 స్థానంలో నిలబెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యేగా కృషి చేస్తున్నానని తెలిపారు. రెడ్ బుక్ కోసం పోలీసులు పనిచేస్తే తప్పేముందని మంత్రి ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా పని చేసిన వారిని రెడ్ బుక్‌లో చేర్చుతామని నాడు చెప్పా.. ఇప్పుడు పోలీసులు చట్ట ప్రకారం పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం పోయి తిరిగి అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. రెడ్ బుక్ దెబ్బకి ఒకరికి గుండెపోటు వస్తే మరొకరు చెయ్యి విరకొట్టుకున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ కుట్రల పట్ల ప్రభుత్వంతో ప్రజలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కుల, మత ప్రాంత విద్వేషాలు రెచ్చగొట్టడంలో వైసీపీ నేతలు ఆరితేరారని మండిపడ్డారు. అందుకే ఫాస్టర్ ప్రవీణ్ మరణం దర్యాప్తుపై ఆయన కుటుంబసభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నా, వైసీపీ రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కుట్రలకు ఆ పార్టీ వెనుకాడదన్నారు. సొంత తల్లి, చెల్లికి సమాధానం చెప్పుకోలేని జగన్ ఇక ప్రజలకు ఏం చెప్తారని ప్రశ్నించారు. విజనరీ, పిజనరీకి తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు. విజనరీ భవిష్యత్తు తరాలు గురించి ఆలోచించి ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తారన్నారు. నాడు కంప్యూటర్‌లు అన్నం పెడతాయా అని విమర్శించిన వాళ్ళు ఉన్నారని అన్నారు. 90వ దశకంలో చంద్రబాబు ఏం చేశారో ఇప్పుడు చాలా మంది సమీక్షిస్తున్నారన్నారు. పీజనరీ చూపు ఎప్పుడు జైలు వైపు, విధ్వంసం వైపే ఉంటు-ంది కాబట్టి పీ4 ఫలాలు తెలియవంటూ మంత్రి లోకేష్ వ్యాఖ్యలు చేశారు. కాగా.. మంగళగిరిలో దశాబ్ధాల సమస్యకు 10 నెలల్లో పరిష్కారం చూపారు మంత్రి లోకేష్. మొదటి విడతలో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న 3 వేలమందికి శాశ్వత పట్టాలు అందజేయనున్నారు. స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందచేసేలా లోకేష్ ప్రణాళికలు రూపొందించారు. 12వ తేదీ వరకు నియోజకవర్గంలో మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమాన్ని మంత్రి లోకేష్ స్వయంగా చేపట్టనున్నారు.

## వైకాపా కుటిల రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి



సోర్సింగ్ నియామకాలను సక్రమ పద్ధతికి తీసుకొద్దామని తెలిపారు. స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి పల్లెనిద్ర, పల్లె వెలుగు, స్వర్ణ గ్రామం పేర్లు పరిశీలన చేయాలన్నారు.
ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఇచ్చే సంక్షేమ పథకాలు నాలుగు రెట్లు అధికమని చెప్పుకొచ్చారు. ఇంత చేసి సరైన ప్రచారం చేసుకోలేక పోతున్నాం అని కేబినెట్ అనంతరం సీఎం అన్నట్లు- తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి-ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై కేబినెట్‌లో చర్చించారు. విజన్ 2047పైన మంత్రులతో చర్చించారు. శాఖలకు స్వయంప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కాస్‌ను ఎలా వినియోగించాలి, ఆప్కాస్ పైన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు- చేసే యోచనపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించినట్లు- తెలుస్తోంది. ఋషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి ఎలా తీసుకురావాలి అనే అంశంపై చర్చించాలని తెలిపారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఋషికొండ ప్యాలెస్‌ను సందర్శించి అభిప్రాయలు చెప్పాలని మంత్రులతో ముఖ్యమంత్రి అన్నారు.

## 400 ఎకరాల్లో చెట్ల నరికివేతపై స్టే



సమాజానికి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టుకు పంపింది. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదిగా కోర్టు చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరం ఏంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. తమ ప్రశ్నలకు సీఎస్ సమాధానం చెప్పాలని కోర్టు ఆదేశించింది. ఇది చాలా తీవ్రమైన అంశం అని జస్టిస్ గవాయ్ ధర్మాసనం పేర్కొంది. అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నెల 16న తదుపరి విచారణ చేపట్టనుంది.

## రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు



**న్యూఢిల్లీ:** సుదీర్ఘ చర్చ తర్వాత లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం ఎగువసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభించారు. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది. అనంతరం ఓటింగ్ పక్రియ నిర్వహించగా. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. రాజ్యసభలోనూ దీనిపై చర్చ కోసం 8 గంటలు కేటాయించారు. అవసరమైతే సమయాన్ని పెంచనున్నారు. అనంతరం ఓటింగ్ చేపడతారు. ఎగువ సభలోనూ అధికార ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం ఉండటంతో బిల్లు గట్టెక్కడం లాంఛనమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఉభయ సభల్లో ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారనుంది.
లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు. గురువారం రాజ్యసభలోకి వెళ్లే ముందు సోనియాగాంధీ మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాశ్వత విభజనను తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే వక్ఫ్ బిల్లును ఆమోదించినట్లు-గా వ్యాఖ్యానించారు. దిగువ సభలో బిల్లును బుల్డోజర్ చేశారని చెప్పారు. అలాగే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేందుకే సభలోకి తీసుకొస్తున్నారని సోనియాగాంధీ ధ్వజమెత్తారు. మోడీ నిర్ణయాలు కారణంగా దేశం అగాధంలోకి నెట్టబడుతోందని.. ఈ నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగం కాగితంపైనే ఉంటుంది.. అందుకే దాన్ని బుల్డోజర్ చేయడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. న్యాయం కోసం ఎంపీలంతా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇక పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని.. తరచుగా గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. బుధవారం బిల్లుపై పార్లమెంట్‌లో వాడీవేడీగా చర్చ జరిగింది. దాదాపు 12 గంటల పాటు- అధికార-ప్రతిపక్ష సభ్యులు ప్రసంగించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బిల్లు ఆమోదం కోసం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ పడడంతో ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 282 మంది ఓటు- వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. ఇక గురువారం ఈ బిల్లు రాజ్యసభకు రానుంది. ఇక్కడ కూడా దాదాపు 8 గంటల పాటు-చర్చ జరగనుంది. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈమేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లుప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ- (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది.

# శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలి

హైదరాబాద్: శ్రీరామనవమి సందర్భంగా 6వ తేదీన నిర్వహించే శోభాయాత్రను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. గురువారం శ్రీరామ శోభాయాత్ర కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేషన్ కమిటీకి సీపీ సీవీ ఆనంద్ కీలక సూచనలు జారీ చేశారు. తారాం భాగ్ నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు శోభాయాత్ర ప్రారంభం అయ్యేలా నిర్వహకులు చూడాలని సూచించారు. శోభాయాత్రలో పెద్దపెద్ద డీజే శబ్దాలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు. శోభాయాత్రలో పాటలు వేరే వర్గాలను కించ పరిచేలా ఉండకూడదని సీపీ సీవీ ఆనంద్ చెప్పారు. శోభాయాత్రలో ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరువైపులా వేదికలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జాయింట్ కంట్రోల్ రూమ్ ఐసీసీసీలో ఏర్పాటు చేసి శోభాయాత్ర తీరును పర్యవేక్షిస్తామని చెప్పారు. శోభాయాత్ర దారులు చిన్నగా ఉంటాయని.. భారీ టస్కర్ వాహనాలు వెళ్లే అవకాశం ఉండదని సీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. అందుకే టస్కర్ వాహనంతో ముందు ట్రయల్స్ నిర్వహించాలని సూచించారు. విగ్రహాల ఎత్తు కూడా చిన్నగా ఉండేలా చూసుకోవాలని సలహా ఇచ్చారు. డ్రోన్స్ ఎగుర వేయాలి అంటే ముందుగా తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. డీజే సౌండ్‌తో అనర్థాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. శోభాయాత్రలో డీజే సౌండ్స్ తక్కువగా ఉండేలా చూడాలని అన్నారు. 24 గంటలు కరెంట్, బ్యాక్ అప్ కోసం జనరేటర్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్టీసీ నుంచి డ్రైవర్లు, కండక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## హైకోర్టులోనూ కొనసాగిన విచారణ



ఉన్న 400 ఎకరాల్లోని చెట్లను నరికి వేస్తున్నారని.. అడ్డుకోవాలంటూ సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని పిటిషనర్ తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టును కోరారు. ప్రభుత్వం పనులు చేపడుతున్న స్థలాన్ని సందర్శించి నివేదిక ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి వరకు చెట్లను నరికివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంపై ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. దీనిపై హైకోర్టులో విచారణ జరుగుతోందని సుప్రీంకోర్టుకు తెలుపగా.. హైకోర్టులో జరిగే విచారణపై తాము ఎలాంటి స్టే ఇవ్వడం లేదని జస్టిస్ బీర్ గవాయ్ స్పష్టం చేశారు.

# సమస్యలపై స్పష్టత లేని విపక్షాలు !

పార్లమెంట్ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ సాగడం లేదు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఘోరంగా విఫలం అవుతోంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చకు తేవడం లో ఆ పార్టీ గత కొంత కాలంగా పార్లమెంటులో విఫలం అవుతోంది. ఎంతసేపు కేవలం బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోందే తప్ప..సమస్యలను ఆధారంగా చేసుకుని బిజెపిని విమర్శలు చేయడం లేదు. పార్లమెంట్ ఇప్పుడు కాంగ్రెస్, బిజెపిల మధ్య వ్యక్తిగత ఎజెండాగా మారింది. మిగతా విపక్షాలు కూడా అలాగే ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో గతంలో చక్కటి చర్చ జరిగేది. ప్రభుత్వం కూడా చర్చలకు అవకాశం ఇచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. సాదాసీదాగా పార్లమెంట్ సమావేశాలు సాగుతు న్నాయి. ఏ పార్టీ ఎజెండా దానికి ఉంది. దాని ప్రాకరమే సాగుతున్నారు. డిఎంకె హిందీవ్యతిరేకత, డీలిమిటేషన్‌పై పోరాడుతోంది. ఆ అంశాలను ప్రస్తావించి హడావిడి చేసింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఈ పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ పోతున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్మేతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించు కోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. యోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బ తీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు జిఎస్‌టి వల్ల కలిగిన విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోలేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. పండించిన పంటలను అమ్ముకునే పరిస్థితి లేదు. బలమైన మార్కెటింగ్ వ్యవస్థ లేకుండా పోయింది. ఇందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పత్తి, మిర్చి, పసుపు,వరి పండించిన రైతులే నిదర్శనం. వ్యయసాయానుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి ఉంటే నిరుద్యోగాన్ని తగ్గించుకునే అవకాశం ఉంది. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. పాలనలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చి,ప్రజలకు ఆసరాగా అండగా, దేశానికి మంచి చేసేలా చేస్తారని మోడీని నమ్మిన ప్రజలు ఇప్పుడు చేష్టలు ఉడిగి చూస్తున్నారు. దీనిపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శ చేసుకుంటే పార్టీకి, దేశానికి మంచిది. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. తీవ్రమైన ఉపాధి లేమి కారణంగా మొన్నటి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీసిందని చాలా మంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. స్వతంత్ర సంస్థల నోరుకట్టేసి, ప్రభుత్వ సంస్థల నివేదికలను దాచేసి, ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకం. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. నిజంగానే ఇదే సాకారం కావాలంటే స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి.



# ఉక్కిరిబిక్కిరి తెలంగాణలో భానుడు ఉగ్రరూపం


**ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత**

**అప్పుడే ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి**

**ముఖ్య వ్యాపార కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వేసవి సీజన్‌లో జ్యూస్ వ్యాపారం పెరిగింది.**

నిజామాబాద్: ఉత్తర తెలంగాణలో మళ్లీ ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గత రెండుమూడు రోజలులుగా ఎండవేడిమికి తోడు ఉక్కపోతలు మొదలయ్యాయి. ఇన్నాళ్లూ చలితో వణికిపోయిన ప్రజలు తాజాగా ముదురుతున్న ఎండలు చెమటలు పట్టిస్తున్నాయి. జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే జనాలు రోడ్లపైకి వస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు రావడంలేదు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఉక్కపోత ఎక్కు వైంది. మధ్యాహ్నం సమయంలో ఇళ్లల్లో ఉండడమే కష్టమవుతోంది. ఎప్పుడూ ఏప్రిల్ నెలలో ఎండల తీవ్రత పెరిగేది. కానీ ఈసారి ముందుగానే ఎండలు మొదలయ్యాయి. ఉత్తర తెలంగాణలో నిజామబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎండల తీవ్రత అప్పుడే పెరిగింది. గరిష్ఠం 38 డిగ్రీలుగా నమోదు అవుతోంది. ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైతే రాబోయే ఏప్రిల్, మేలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తి పోతున్నారు. వేసవి సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే శీతల పానియాల కేంద్రాలు సిద్ధమవుతుండడంతో కూలర్‌ల తయారీలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. ఎండల తీవ్రతకు ముందే ముందస్తుగా కూలర్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సీజన్ ఊపందుకుంటే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్య వ్యాపార కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వేసవి సీజన్‌లో జ్యూస్ వ్యాపారం పెరిగింది. ఎండలు మండుతుండడంతో.. ద్రాక్ష, పైనాఫిల్, అరటి, బత్తాయి, సపోట,

పుచ్చకాయ,నిమ్మ, ఆపిల్ పండ్లకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. చెరకు, లస్సీ, మజ్జిగ, మామిడి, మిక్స్‌డ్ ఫ్రూట్స్ లాంటి పలు రకాల పానీయాల జ్యూస్ సెంటర్లలో లభిస్తున్నాయి.



# ధరలతో సామాన్యుల కుదేలు

**విజయవాడ: ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్నచందగా మారింది.ఒక వైపు పప్పు, ఉప్పులు మొదలు కొని ధరలు వరుసగా పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. సామాన్యుడి నడ్డి విరిచే విధంగా ధరలు పెంచుకుంటూ పోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న ధరలు సామాన్య ప్రజలను నట్టేట ముంచేలా ఉన్నాయి. కొవిడ్ అనంతర పరిణామాలతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమ వుతున్న ప్రస్తుత తరుణంలో నిత్యావసర ధరలు భారంగా మారుతున్నాయి. మోదీ పాలనలో సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని అనుకున్నాం. కానీ అసలు గరీబోళ్లకే గండి పడేటట్టు ధరలు పెంచుతున్నారు. బియ్యం మొదలు పప్పులు ఉప్పుల ధరలు అందనంతగా పెరిగి పోతున్నాయి. కూరగాయల ధరలు మండుతున్నాయి.**



# వైభవంగా శ్రీ కోదండరాముని రథోత్సవం





**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 03**

తిరుపతి శ్రీ కోదండరామస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9.15 గంటలకు శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, భజన బృందాలు కోలాటాలు ఆడుతుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. రథం నాలుగు మాడ వీధుల్లో ఊరేగి యథాస్థానానికి చేరిన తరువాత ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి హారతి ఇచ్చారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వ జ్ఞానమిదే. మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు అర్చకులు తిరుమంజనం, ఆస్థానం నిర్వహించనున్నారు. రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు అశ్వవాహన సేవ వేడుకగా జరగనుంది. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, ఏఈవో శ్రీ రవి, సూపరింటెండెంట్ శ్రీ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ 4న చక్రస్నానం**

శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం వైభవంగా జరుగనుంది.



# ఒంటిమిట్టలో "హరిద్రా ఘటనం" తో మొదలైన శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 03**

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయ ప్రాంగణంలో గురువారం హరిద్రా ఘటనం – పసుపు దంచే సాంప్రదాయ కార్యక్రమం ప్రారంభమైంది. హిందూ సనాతన ధర్మంలో, ఏదైనా శుభ కార్యక్రమం లేదా సాంప్రదాయ కార్యక్రమాలు పసుపు పొడి తయారీతో ప్రారంభమవుతుంది. ఆలయ అర్చకులు శ్రీ మనోజ్ స్వామి మాట్లాడుతూ , హరిద్రా ఘటనం సమయంలో తయారు చేసిన పసుపు పొడిని వార్షిక బ్రహ్మోత్సవాలలో అభిషేకం, కళ్యాణం, అక్షింతలు తయారీలోను, పలు శుభకార్యాల్లో ఉపయోగిస్తారన్నారు. వందలాది మంది మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు రామనామ స్మరణతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. టిటిడి మహిళా ఉద్యోగులు ఈ శుభ సందర్భంగా "సారె" సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, పిఆర్వో (ఎఫ్ఎసి) కుమారి నీలిమ, ఎస్వీబీసీ ఓఎస్డీ శ్రీమతి పద్మావతి, అర్చకులు శ్రీ వీణా రాఘవాచార్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పుత్తూరు, వడమాల పేట మండలాల అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేయాలి

## వేసవి దృష్ట్యా ఎక్కడ నీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

## రెండు మండలాలలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఎంఎల్ఏ గాలి భాను ప్రకాష్



**పుత్తూరు, ఉత్తేజిత ప్రతినిధి,ఏప్రిల్ 3 :**

పుత్తూరు, వడమాలపేట మండలాల అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేయాలి అని జిల్లా కలెక్టర్ అన్నారు. గురువారం ఉదయం పుత్తూరు పురపాలక సంఘము సమావేశ మందిరము నందు నగరి నియోజకవర్గం, పుత్తూరు, వడమాలపేట మండలాల అబివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగరి ఎంఎల్ఏ గాలి భాను ప్రకాష్, సంబంధిత శాఖల జిల్లా మరియు మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్షా సమావేశము నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల కంటే వడమాలపేట, పుత్తూరు మునిసిపాలిటీ, మండలాలలో నందు నీటి సమస్య ఉందని దీనికి సంబందించి తీసుకోవాల్సిన చర్యలపై మరియు సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై మున్సిపాలిటీ , పంచాయితీ అధికారులతో ఈ రోజు సమావేశం నిర్వహించడం జరిగిందని అన్నారు. రానున్న వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ప్రతి హ్యాబిటేషన్, ప్రతి ఇంటికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశించుకున్న మేరకు ప్రతి రోజు 55 ఎల్ పీ సి నీరు అందించే విధంగా సంబందిత అధికారులు కార్యాచరణ చేసుకోవాలని అన్నారు. క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా బోరు బావులకు ఫ్లష్ యింగ్ వంటి పనులు చేసుకోవాలని , అత్యవసర పరిస్థితులలో కొన్ని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు ముందుగానే కార్యాచరణ చేసుకోవాలని అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 10 అంశాలలో భాగంగా కెనాల్స్ డీసీల్టింగ్ , ఫార్మ్ పాండ్స్ , %ఏఞ్‌శ్రీవ ఒఞ్రవం%, ట్రెంచింగ్, రైన్ హార్వెస్టింగ్ కు సంబందించిన ఉపాధి హామీ పథకం కింద ఈ పనులను ఏ పీ ఓ లు , ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఎం పీ డి ఓ లు కార్యాచరణ చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. మెటీరీయల్ వర్క్స్ లో భాగంగా కాటల్ షెడ్లు, శ్మశాన వాటికల ఏర్పాటు , సి సి రోడ్లు, సి సి డ్రెయిన్స్ నిర్మాణాలకు సంబందించి చేయవలసిన పనులను గుర్తిస్తే గుర్తిస్తే వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. పుత్తూరు పడమల పేట మండలాలలో ఉపాధి హామీ పథకం కింద పని దినాలను, వేతనాలను పెంచే దిశగా కృషి చేయాలన్నారు. పేదలకు పక్కా ఇళ్లు కట్టించేందుకు ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద మండలాల్లో భూమిని గుర్తించే పనులను వేగవంతం చేయడం వలన అర్హులైన వారికి స్థలం మంజూరు చేయవచ్చు అని తెలిపారు. ఇదివరకు జరిగిన రీసర్వే ప్రక్రియలో దొర్లిన తప్పులను సరిచేసి పక్కాగా రీ సర్వే పనులు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే దిశగా నూతనంగా ప్రవేశపెట్టిన క్లస్టర్ విధానం పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సంబంధిత ఎంఈఓ లు హెచ్ ఎం ఓ లు దృష్టి పెట్టాలన్నారు. పుత్తూరు వడమల పేట మండలాలలో ధాన్య సేకరణ సంబంధించిన పనులను త్వరితగతన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలాలలో ఉద్యాన శాఖ ద్వారా మామిడి పంట కాకుండా కొత్తగా ఇతర పంటలు వేసేందుకు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నగరి ఎం ఎల్ ఏ మాట్లాడుతూ .. రానున్న వేసవి లో వడమాలపేట, పుత్తూరు మునిసిపాలిటీ, మండలాలలో నీటి ఎద్దడి సమస్యలు రాకుండా సంబందిత అధికారులు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పారిశుధ్యం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. గ్రామాల్లో ఎక్కడ మట్టి రోడ్లు ఉండకూడదు అని, రోడ్డు సమస్య తో ప్రజలు ఇబ్బంది పడరాదని, పెండింగ్ రోడ్ల నిర్మాణం పనులు వేగవంతం చేసి పూర్తి చెయ్యాలని పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వంత స్థలం లేని వారికి అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు, రూరల్ ప్రాంతాలలో 3 సెంట్లు భూమిని ఇవ్వడానికి తగు చర్యలు చేస్తోందని దీనికి సంబందించి రేషన్ కార్డు ఉండి భూమి లేని వారిని గుర్తించాలని అలాగే ఎంత భూమి అవసరం ఉంది అనే

అంశాల పై రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకుని హౌసింగ్ అధికారులకు ఇస్తే తద్వారా ఇల్లు లేని వారికి ప్రభుత్వ పథకాల ద్వారా స్థలం మంజూరు జరుగుతుందని అన్నారు.

# శ్రీ రాముల ఆలయానికి వెండి కిరీటాలు అందజేసిన డోన్ ఎమ్మెల్యే

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



: మండల పరిధిలోని శంకరాపురం గ్రామంలో వెలసిన శ్రీరామ ఆలయానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి,కోట్ల సుజాతమ్మ దంపతులు శ్రీరామూల ఆలయానికి గురువారం వెండి కిరీటాలను అందజేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా శ్రీరామ ఆలయంలోవెలసిన శ్రీరాముడు,సీత,లక్ష్మణుడు,ఆంజనేయ స్వామి విగ్రహాలకు వెండి కిరీటాలు అందచేశారు.వారి రాకకు గ్రామ పెద్దలు,గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయ అర్చకులు మహామంగలహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు.ఈ కార్యక్రమంలోగ్రామ పెద్దలు హనుమంతురెడ్డి,శేఖర్,మధు,మహేష్,చిన్న నాగిరెడ్డి,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# స్థలం పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్న అల్తాఫ్

**ఏప్రిల్ 3 ఉత్తేజిత ప్రతినిధి**

పేదవారి స్థలాలే ధ్యేయంగా పెట్టుకొని వాటిని కబ్జా చేసి అందులో ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేసి వారిని నానా దుర్భాషలాడుతూ ఎలాగైనా ఆ స్థలంలో పాగా వేయాలని దురుద్దేశంతో ఆ స్థలం కన్ను వేసిన అల్తాఫ్...!!!దళిత కులానికి చెందిన పుష్పావతి నంద్యాల నందమూరి నగర్ లో ప్రభుత్వం 2007లో ప్లాట్ నెంబర్ 1307 ప్లాట్ ఇంటి నంబర్ 193/2 నివాస స్థలం ఇవ్వడం జరిగింది. అప్పటినుండి అదే స్థలమునందు కుటుంబ సమేతంగా నివాసం ఉంటున్నారు..2017 సంవత్సరం మిడుతూరు నివాసి భూస్వామి అయిన అల్తాఫ్ అనే వ్యక్తి నా భర్త లేని సమయంలో మా స్థలం వద్దకు వచ్చి నేను పనిచేసుకొంటూఉండగా ఈ స్థలము నేను కొన్నాను ఈ స్థలం నాది అంటూ మీరు ఎందుకు ఇక్కడ ఉన్నారు అని అడుగగా ఇది మా స్థలము మాకు ప్రభుత్వం కేటాయించిన స్థలం అని నేను ఎదురు చెప్పానని నాకే ఎదురు సమాధానం చెప్తావా అని కులం పేరుతో దూషిస్తూ బూతులు తిడుతూ ఇంట్లోని సామాను బయట వేసేందుకు ప్రయత్నించగా చుట్టూ ఉన్నవారు ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించగా ఈ స్థలాన్ని నేను కొన్నానని అక్కడున్నవారు మీకేమైనా ఆధారాలు ఉన్నాయని

ప్రశ్నించగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు..... నా భర్త లారీ డ్రైవర్

గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాం నా భర్త లారీ కి వెళ్ళిన సమయం చూసి అల్తాఫ్ మళ్ళీ మా ఇంటి వద్ద ఉన్న ఆడవాళ్లను బెదిరించడం బూతులు తిట్టడం సామాను బయట వేస్తానని ఇష్టానుసారంగా మాట్లాడడం నా భర్త లేని సమయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు ఈ స్థలం మాకు జీవనాధారం ఒకవేళ ఈ స్థలాన్ని మాదే అంటున్నా అల్తాఫ్ దళితుల భూములను టార్గెట్ చేస్తూ స్థలాలను కబ్జా చేస్తున్నాడు ఒకవేళ మా స్థలాన్ని కబ్జా చేస్తే మేము కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకుని చనిపోతామని స్పష్టం చేస్తూ ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని అధికారులు నాకు న్యాయం చేయవలసిందిగా కోరుతున్నాను అంటూ మీడియా వాపోయిన మహిళా...

# ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ వేధింపులు తాళలేక మహిళా ఆత్మహత్యాయత్నం.

## ఇంటి ముందర బేటాయించిన ఫైనాన్స్ ఏజెంట్

## హార్ట్ పేషెంట్ ని, ఇద్దరు చిన్నపిల్లలు స్పందన కంతు చెల్లించలేను.... షేక్ షాజహాన్.

**నందికొట్కూర్ ఏప్రిల్ 3 ఉత్తేజిత ప్రతినిధి**



పేదలను మైక్రో ఫైనాన్స్ సంస్థలు రోజురోజు కు వేధింపులు ఎక్కువవడంతో మహిళలు వాటిని భరించలేక అవమానాలకు భయపడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నగర్ కు చెందిన షాజహాన్ అనే మహిళ బుధవారం స్పందన మైక్రో ఫైనాన్స్ కంపెనీ లో తీసుకున్న అప్పుకు కంతు చెల్లించలేక పోవడంతో స్పందన ఏజెంట్ పెట్టి బాధలు భరించలేక ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. చుట్టుపక్కల వారు గమనించి ఉరి వేసుకున్న ఆ మహిళను కాపాడి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె మీడియాతో మాట్లాడుతూ గత సంవత్సరం కాలానికి సంబంధించిన నలుగురు మహిళలను కలిసి పర్వీన్ గ్రూపుగా ఏర్పడి ఒక్కొక్కరం 20000 రూపాయలు తీసుకొని నెల నెల కంతు చెల్లించడంతో స్పందన పొదుపు వారు ఆరు నెలల తర్వాత మరో 30000 ఒక్కొక్కరికి అప్పుగా ఇచ్చారని ఆమె తెలిపారు. తీసుకున్న అప్పుకు ప్రతి నెల కంతు రూ 3700 చెల్లించాల్సిందిగా స్పందన పొదుపు ఏజెంట్లు నిర్ణయించారన్నారు. అదేవిధంగా ప్రతి నెల కంతు తప్పనిసరిగా చెల్లించామని ఆమె తెలిపారు. అయితే గత కొంతకాలంగా తాను గుండె వ్యాధితో బాధపడుతూ ఉండేదాన్ని, తనకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని కంతులు చెల్లించడంలో కొంత జాప్యము జరుగుతుందని ఆమె తెలిపారు. అయితే బుధవారం నెలకంతు చెల్లించవలసి ఉండగా నాకు అనారోగ్యకరణం చేత ఈ నెల కంతు చెల్లించలేదని పొదుపు ఏజెంట్ వెంకటేష్ తెలిపాను అన్నారు. అయితే ఇంటి ముందు కూర్చుని వెళ్లకపోవడంతో తాను తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిన వదలకుండా అక్కడికి వచ్చి రాత్రి 12 గంటలైనా నేలకంతు చెల్లించాల్సిందేనని అక్కడే ఉంటామని తమను నలుగురిలో అవమానించారని దీంతో బాధ భరించలేక తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని షేక్ షాజహాన్ వివరించారు. ప్రస్తుతం నందికొట్కూరు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పోలీసులు ముందుగా ఆసుపత్రికి తరలించవలసిందిగా బంధువులకు తెలిపారు. దీంతో ఆమెను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో షేక్ షాజహాన్ కు వైద్యులు చికిత్సలు నిర్వహిస్తున్నారు.

# హద్దుల్లో ఉంటూ..పాలన సాగించాలి!

ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి పోయింది. ఎవరు అధికారంలో ఉన్నా తమకు అనుకూలమైన పనులు నెరవేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్నీ రాజకీయాల చుట్టే తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఏం తీర్పు రాబోతోందో అన్నది సర్వత్రా ఉత్కంఠగా ఉంది. గతంలో ఉన్నట్లుగానే చట్టాలు ఉన్నాయని, కొత్తగా ఉప ఎన్నికలు రావడానికి అవకాశం లేదని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యలు చేశారు. దీనిపైనా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సిఎంకు నియంత్రణ లేదా అని ప్రశ్నించింది. అంటే నేతలు ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు. ఇకపోతే బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వేదికగా మొత్తం ప్రభుత్వమే తరలి వెళ్లి ధర్నా చేసింది. సిఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ పరివారం వెళ్లింది. నిజానికి ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాల్సిన వ్యవహారం. రాజ్యాంగ విలువలు, నిబంధనలతో కూడుకున్న విషయం. దీనిపై తేల్చండి అంటూ..ఢిల్లీకి వెళ్లారు. ధర్మయుద్ధం అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన,ఇస్తున్న హామీలకు కేంద్రాన్ని బాధ్యులుగా చేసి విమర్శలు చేయడం సరికాదు. ఇకపోతే హైదరాబాద్‌కు ధీటుగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్కడ పరిశ్రమలు, ఐటి సంస్థలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరి కొత్తగా ఇప్పుడు వివాదంలోకి వచ్చిన 400 ఎకరాల్లో ఐటి పార్కులు అభివృద్ధి చేస్తామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఓ వైపు ఆందోళనలు జరుగు తున్నా, సుప్రీం విచారణ చేస్తున్నా ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. నిజానికి ఈ 400 ఎకరాలను అర్జంటుగా అమ్మి డబ్బులు చేసుకోవాలన్న ఆత్రుత పాలకుల్లో ఉంది. ఇకపోతే బిఆర్ఎస్ నేతలు గత పాపాలను వదిలి కొత్తగా కాంగ్రెస్ మాత్రమే పాపాలు చేస్తున్నదన్న రీతిలో తెగ రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. దీంతో తమ పాపాల తాలూకు వాసనలు రాకుండా చూసుకోవాలన్న పనిలో పడ్డారు. అందుకే విపక్ష బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్టుల కుంభకోణాలు,అవినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదను గుర్తించారు. వారి పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శలు వచ్చాయి. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలను పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు.ఈ క్రమంలో గతంలో, ఇప్పుడు అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజలే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలి.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఏప్రిల్ 3 :**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనారోగ్యంతో ఉన్నవారికి మెరుగైన వైద్యానికి ఆర్థిక సహాయం అందించేందుకు సీఎంఈవై ప్రవేశ పెట్టడం జరిగింది ఇందులో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద గురువారం నందికొట్కూరు పట్టణంలోని వాల్మీకి నగర్ కు చెందిన పసుల శివప్రియకు మంజూరైన 1,41,662 రూపాయలు, క్రిందింటి జయన్న కు 36,600/- రూపాయలు,మరియుపఠాన్ అబ్దుల్ హఫీస్ కు 37,100/రూపాయల చెక్కును ఎమ్మెల్యే గిత్త జయసూర్య వారి ఇంటికి వెళ్లి స్వయంగా ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఆరోగ్యమే మహాభాగ్యం'. ఆరోగ్యవంతమైన వ్యక్తులతోనే ఆనందమయ సమాజం, వాటితోనే అత్యుత్తమ అభివృద్ధి సాధ్యం. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే, ఉల్లాసంగా ఉత్సాహంగా జీవించి కష్టపడి జీవితాన్ని సాఫల్యం చేసుకోగలరన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అనారోగ్య బాధితులకు ఆసుపత్రి ఖర్చుల కోసం, 'ముఖ్యమంత్రి సహాయ నిధి' నుంచి మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్రా సురేంద్రనాథ్ రెడ్డి మరియు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బాణసంచా కర్మాగారంలో పేలుడు.. 18కి చేరిన మృతులు

బనస్కంతా: గుజరాత్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బనస్కంతా జిల్లాలోని ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 18కి పెరగ్గా.. ఐదుగురికి గాయాలైనట్లు పోలీసులు వెల్లడించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది.

దీసా పారిశ్రామిక ప్రాంతంలోని ఓ కర్మాగారంలో మంగళవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పేలుడు ధాటికి ఫ్యాక్టరీ పైకప్పు కూలిపోయింది. దీంతో పలువురు కార్మికులు, వారి కుటుంబసభ్యులు కూడా చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలిస్తున్నారు. కొందరిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫ్యాక్టరీ యజమాని ప్రస్తుతం పరారీలో ఉన్నారని, అతడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

# రాజకీయాలు నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు

## యోగి ఆదిత్యనాథ్



ప్రధాని నరేంద్ర మోదీ వారసత్వం గురించి మహారాష్ట్ర అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన రాజకీయ జీవితంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని. పార్టీ నన్ను యూపీ ప్రజల కోసం నియమించింది. అందుకే రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తున్నాను. ఇక పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు. వాస్తవానికి నేను ఒక యోగిని' అని ఆయన పేర్కొన్నారు.

ప్రతి పనికి ఒక కాలపరిమితి ఉంటుందని.. అదే విధంగా తన రాజకీయ జీవితానికి కూడా పరిమితి ఉంటుందని అన్నారు. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా హైకమాండ్‌తో తనకు విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలను యోగి ఖండించారు. తనకు పార్టీ ఇచ్చిన అవకాశం వల్లే ఇక్కడ కూర్చున్నానని.. పార్టీ పెద్దలతో విభేదాలు ఉంటే ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగేవాడిని కాదని అన్నారు. ఎవరో ఒకరు తప్పుడు ప్రచారాలు చేస్తూనే ఉంటారని.. వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు.

ఆదివారం నాగ్‌పుర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించడంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని ఇప్పుడు వెళ్లడం వెనక ముఖ్యమైన కారణం ఉండొచ్చని అన్నారు. ఆయన పదవీవిరమణ చేయాలని యోచిస్తున్నారని.. తన రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశ రాజకీయ నాయకత్వంలో ఆరెస్సెస్ మార్పు కోరుకొంటోందని, మోదీ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని అన్నారు. ఆయన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కొట్టిపడేశారు. ఈ నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## మయాన్మార్‌కు ఆపన్న హస్తం.. 50 టన్నుల సహాయక సామగ్రిని అందజేసిన భారత్


భూకంపంతో అతలాకుతలమైన మయాన్మార్‌ను ఆదుకునేందుకు ఆపరేషన్ బ్రహ్మను ప్రారంభించిన భారత ప్రభుత్వం తాజా మరో 50 టన్నుల సహాయక సామగ్రిని అందించింది. వివిధ రకాల సహాయక సామగ్రితో భారత నావికాదళానికి చెందిన సత్‌పుర, సావిత్రి నౌకలు యాంగూన్‌కు చేరుకున్నాయి. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఎమ్‌సీసీ విమానాలతో పాటు నేవీకి చెందిన ఐదు నౌకల ద్వారా భారత్ ఆపరేషన్ బ్రహ్మ చేపడుతున్నట్టు యాంగూన్‌లోని భారత ఎంబసీ కూడా పేర్కొంది. భూకంపంతో ప్రభావితమైన యాంగూన్‌తో పాటు నేపీదా, మాండలేకు ఈ సామగ్రిని చేరుస్తున్నట్టు పేర్కొంది.

## గాంధీ మునిమనవడి పిటిషన్ కొట్టివేత

దిల్లీ: సబర్మతి ఆశ్రమం ఆధునికీకరణ అంశంపై మహాత్మా గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీనిని భావోద్వేగాలతో ముడిపెట్టొద్దని సూచించింది. ఇంతకీ విషయం ఏంటంటే..?

గుజరాత్ అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని రూ.1200కోట్లతో ఆధునికీకరించాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిని 2022లో గుజరాత్ హైకోర్టు సమర్థించింది. అయితే తుషార్ గాంధీ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్ ప్రభుత్వ ప్రతిపాదిత ప్రాజెక్టు ఆశ్రమం టోపోగ్రఫీ మారిపోతుందని.. నైతికత దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "మీ భావోద్వేగాలను ఈ అంశంతో ముడిపెట్టవద్దు. మనం ముందుకు వెళ్తున్నాం. ఈ దేశం ముందుకు వెళ్తోంది. ఇలాంటి అంశాలను ఇతర కోణాల్లో చూడాలి" అని కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. తాము అన్ని అంశాలను పరిశీలించామని, అభ్యంతరం చెప్పడానికి ఏమీ లేదని వ్యాఖ్యానించింది.ద

## అత్యాచారం కేసు.. మతబోధకుడు బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు



చండీగఢ్: పంజాబ్‌కు చెందిన ప్రముఖ మతబోధకుడు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ బాజిందర్ సింగ్‌కు అత్యాచారం కేసులో శిక్ష పడింది. 2018లో ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గానూ ఇటీవల అతడిని దోషిగా తేల్చిన మొహాలీ కోర్టు.. తాజాగా శిక్ష ఖరారు చేసింది. బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురిని న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. బాజిందర్ సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని జిరాక్‌పుర్‌కు చెందిన ఓ మహిళ 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విదేశాలకు తీసుకెళ్తానని ఆశపెట్టి అతడు తనను ఇంటికి ఆహ్వానించాడని బాధితురాలు తెలిపింది. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడి.. ఆ దృశ్యాలను రికార్డ్ చేశాడని ఆరోపించింది. అతడి డిమాండ్లకు అంగీకరించకపోతే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించినట్లు తెలిపింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఇటీవల దిల్లీ ఎయిర్‌పోర్టులో అతడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన కోర్టు.. అతడిని దోషిగా తేల్చి జీవితఖైదు విధించింది.

# భారత్ వేసే సుంకాలు తగ్గొచ్చు: ట్రంప్



భారత్ సహా కీలక భాగస్వామ్య దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలపై రేపు (ఏప్రిల్ 2న) తుది నిర్ణయం వెలువడనుంది. ఈ తరుణంలో మనదేశాన్ని ఉద్దేశించి ట్రంప్ స్పందించారు. లిబరేషన్ డే డెడ్‌లైన్‌కు ముందే భారత్ నుంచి భారీగా టారిఫ్ కోతలు ఉంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను గణనీయంగా తగ్గించాలని నిర్ణయానికి వచ్చిందని పేర్కొన్నారు.

"అమెరికాతో అన్యాయంగా ప్రవర్తించిన చాలా దేశాలు తమ సుంకాలను తగ్గించుకుంటాయి. ఈయూ ఇప్పటికే 2.5 శాతం మేర తగ్గించుకుంది. భారత్ కూడా గణనీయంగా సుంకాలను తగ్గించుకుంటుందని ఇటీవల విన్నాను" అని అధ్యక్షుడు తాజాగా మాట్లాడారు. పరస్పర సుంకాల తగ్గింపు అమల్లోకి తీసుకురావాలనుకుంటున్న రోజునే ఆయన లిబరేషన్ డేగా అభివర్ణిస్తున్నారు. ఏప్రిల్ 3 నుంచి వాహనాలు, వాటి విడిభాగాలపై 25 శాతం సుంకాలు అమలుకానున్నాయి. ఇంతకుముందు ఇదే అంశంపై వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ 100శాతం సుంకాలు వసూలు చేస్తోందని అన్నారు. ఇతర దేశాలు విధించే అధిక సుంకాల వల్ల అమెరికా ఉత్పత్తులను ఎగుమతి చేయడం అసాధ్యంగా మారుతోందని అన్నారు. అందుకే వాటిపై ప్రతీకార సుంకాలకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం భారత్‌కు అమెరికా చేసే ఎగుమతులకు సగటున 7.7 శాతం టారిఫ్ ఉండగా.. అమెరికాకు భారత ఎగుమతులపై కేవలం 2.8 శాతమే ఉంది. అంటే వ్యత్యాసం 4.9 శాతం. ఒకవేళ భారత్ నుంచి ఎగుమతి అయ్యే అన్ని ఉత్పత్తులపై ఏకరీతిలో అమెరికా టారిఫ్‌లు విధిస్తే.. అదనంగా ఈ 4.9 శాతం మేర పెరగొచ్చు. ఒకవేళ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ఉత్పత్తులకు వేరుగా టారిఫ్‌లు విధించాలని అమెరికా నిర్ణయిస్తే.. భారత్ నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు 32.4%, పారిశ్రామిక ఉత్పత్తులకు 3.3 శాతం మేర టారిఫ్‌లు పెరిగే అవకాశం ఉంటుంది.



## రేపు ఒకరి అరెస్టు తప్పదు..

### ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ శాఖ సారథిగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ సెక్యూరిటీ నిధుల దుర్వినియోగంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి 4 లక్షల నంబర్లు దొంగలించిన వ్యక్తి రేపు అరెస్టు అవుతారని పేర్కొన్నారు. మస్క్ మాట్లాడిన ఒక వాయిస్ నోట్‌ను డోజ్ డిజైనర్స్ ఎక్స్‌లో పోస్టు చేసింది.

ఆడియో ప్రకారం.. 'రేపు ఒకరిని అరెస్టు చేయబోతున్నారు. అతడు సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి 4లక్షల సోషల్ సెక్యూరిటీ నంబర్లను, వ్యక్తిగత సమాచారాన్ని దొంగలించి, విక్రయించాడు. ఇది వలసదారులను అక్రమ ఓటర్లుగా మార్చే వేదికగా మారింది' అని మస్క్ పేర్కొన్నారు. అమెరికా పౌరులు కాని ప్రజలకు వీటిని అందించి తమకు ఇష్టమైన వ్యక్తులకు ఓటు వేసేలా ప్రేరేపిస్తున్నారని మస్క్ ఆరోపించారు.

## భారత్ 100% సుంకాల వసూలు.. ప్రతీకారానికి సమయమిదే: వైట్‌హౌస్



వాషింగ్టన్: భారత్ సహా కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాలకు సిద్ధమైంది అగ్రరాజ్యం అమెరికా. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. ఇందులో ఎలాంటి మినహాయింపులు లేవని ఇప్పటికే ఆయన స్పష్టం చేశారు. తాజాగా దీనిపై వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ 100శాతం సుంకాలు వసూలు చేస్తోందని అన్నారు. ఇతర దేశాలు విధించే అధిక సుంకాల వల్ల అమెరికా ఉత్పత్తులను ఎగుమతి చేయడం అసాధ్యంగా మారుతోందని అన్నారు. అందుకే వాటిపై ప్రతీకార సుంకాలకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు.

అమెరికాపై అత్యధిక సుంకాలు వసూలు చేస్తున్న దేశాల జాబితాను కరోలిన్ మీడియాకు చూపించారు. "దురదృష్టవశాత్తూ కొన్ని దేశాలు చాలా కాలంగా మమ్మల్ని టారిఫ్‌ల రూపంలో పీల్చేస్తున్నాయి. అవన్నీ అన్యాయమైన వాణిజ్య విధానాలు. అమెరికా డెయిరీ ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య 50శాతం సుంకాలు వసూలు చేస్తోంది. మా బియ్యంపై జపాన్ 700శాతం, యూఎస్ వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం, మా బటర్, చీజ్‌పై కెనడా 300 శాతం టారిఫ్ వసూలు చేస్తున్నాయి. వీటి వల్ల మా ఉత్పత్తులను ఆయా మార్కెట్లకు పంపించడం అసాధ్యంగా కన్పిస్తోంది. అమెరికన్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. అందుకే ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించేందుకు ఇదే సమయం అని భావిస్తున్నాం" అని ఆమె వివరించారు.

# "భారత్" చాలా అద్భుతంగా ఉంది..

## వ్యోమగామి సునీతా విలియమ్స్



న్యూయార్క్: దాదాపు 9 నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయి ఇటీవల సురక్షితంగా పుడమిని చేరిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ తాజాగా బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. నాసా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వీరు.. రోదసిలో తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా అంతరిక్షం నుంచి భారత్ ఎలా కన్పించిందని మీడియా అడిగిన ప్రశ్నకు సునీత బదులిచ్చారు. చాలా అద్భుతంగా కన్పించిందని తెలిపారు. అంతేకాదు.. త్వరలోనే భారత్‌కు వచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

"భారత్ చాలా అద్భుతంగా ఉంది. మేం హిమాలయాల మీద నుంచి వెళ్లిన ప్రతి సారీ.. ఆ మంచు కొండల అందాలను బుచ్ విల్మోర్ కెమెరాలో బంధించారు. తూర్పు వైపు నుంచి గుజరాత్, ముంబయి వంటి ప్రాంతాల మీదుగా వెళ్తున్నప్పుడు.. తీరం వెంబడి ఉండే మత్స్యకారుల పడవలు మాకు సిగ్నల్‌లాగా పనిచేసేవి. ఇక మొత్తంగా భారత్ నాకు ఎలా కన్పించిందంటే.. పెద్ద నగరాల నుంచి లైట్ల నెట్‌వర్క్ చిన్న నగరాల మీదుగా వెళ్తున్నట్లు కన్పించేది. ఇక హిమాలయాలైతే అత్యద్భుతం" అని సునీతా విలియమ్స్ వివరించారు.

ఇక, భారత్‌కు వచ్చే అవకాశాల గురించి ఆమె ప్రస్తావించారు. "నా తండ్రి పుట్టిన దేశానికి త్వరలోనే తిరిగివెళ్లాలని అనుకుంటున్నా. అక్కడి బంధువులు, ప్రజలతో ముచ్చటించాలని, అంతరిక్షంలో నా అనుభవాలను వారితో పంచుకోవాలని ఉంది" అని సునీత ఆనందం వ్యక్తం చేశారు. భారత్ అద్భుతమైన ప్రజాస్వామ్య దేశమని, అంతరిక్ష యాత్రల్లో విజయాలు సాధిస్తున్న దేశాల సరసన నిలుస్తున్న గొప్ప దేశమని కొనియాడారు. తనలోనూ ఆ మూలాలు ఉండటం గర్వంగా ఉందన్నారు.



# స్నేహిత్ @ 89

హైదరాబాద్: భారత యువ టేబుల్ టెన్నిస్ ఆటగాడు ఫిదెల్ స్నేహిత్ టాప్-100లో చోటు దక్కించుకున్నాడు. తాజా ప్రపంచ టీటీ ర్యాంకింగ్స్‌లో అతడు 89వ స్థానంలో నిలిచాడు. ఇటీవల డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నమెంట్లో అదిరే ప్రదర్శన చేసిన స్నేహిత్.. 34 స్థానాలు మెరుగయ్యాడు. టోర్నీ రెండో రౌండ్లో ప్రపంచ 29వ ర్యాంకర్ యుకియా ఉడాను కంగుతినిపించిన స్నేహిత్.. ప్రిక్వార్టర్స్‌లో భారత దిగ్గజ ఆటగాడు ఆచంట శరత్ కమల్‌ను ఓడించాడు. స్నేహిత్ క్వార్టర్స్‌లో పరాజయం పాలయ్యాడు. డబుల్స్‌లో శరత్‌కమల్‌తో జత కట్టి సెమీఫైనల్ వరకు వెళ్లాడు. "టాప్-100 ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోవడం చాలా సంతోషంగా అనిపిస్తోంది. ఈ ఏడాది నా తొలి లక్ష్యాన్ని అందుకున్నా. ఇక టాప్-50పై దృష్టి పెడతా" అని స్నేహిత్ తెలిపాడు. భారత్ తరఫున స్నేహిత్ కాకుండా మానవ్ థక్కర్ (47వ ర్యాంకు), హర్మీత్ దేశాయ్ (68), మనుష్ షా (73), శరత్ కమల్ (80) టాప్-100లో ఉన్నారు.

# వందన వీడ్కోలు

## రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ హాకీ ప్లేయర్



ఢిల్లీ : భారత మహిళల హాకీ జట్టు క్రీడాకారిణి వందన కటారియా తన 15 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. దేశం తరఫున 320 మ్యాచ్‌లలో 158 గోల్స్ చేసిన వందన.. భారత మహిళా హాకీ జట్టుకు అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా గుర్తింపు దక్కించుకుంది. 2009లో సీనియర్ జట్టులోకి వచ్చిన వందన.. 15 ఏండ్ల కెరీర్‌లో భారత్ సాధించిన చరిత్రాత్మక విజయాల్లో కీలకపాత్ర పోషించింది. టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులో ఆమె సభ్యురాలు. ఆ మెగా టోర్నీలో వందన హ్యాట్రిక్ గోల్స్ చేసి భారత్ తరఫున ఒలింపిక్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి మహిళా ప్లేయర్‌గా రికార్డులకెక్కింది. ఆటకు వందన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆమెకు 2021లో అర్జున, 2022లో పద్మశ్రీ అవార్డులతో సత్కరించింది.

# హెచ్‌సీఏ నష్ట నివారణ

హైదరాబాద్, ఈనాడు: ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్‌తో వివాదం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) నష్ట నివారణ చర్యలకు దిగింది. ఉచిత పాస్‌లు కేటాయింపు, ఇతర అంశాలపై సన్‌రైజర్స్ ప్రతినిధులతో హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్.దేవరాజ్ మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీసీఐ, హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ మధ్య ఉన్న త్రిముఖ ఒప్పందాన్ని కచ్చితంగా పాటించాలని, ముందు నుంచి అనుసరిస్తున్నట్లే స్టేడియం సామర్థ్యంలో పది శాతం పాస్‌లను హెచ్‌సీఏకు కేటాయించాలని తీర్మానం జరిగింది. సన్‌రైజర్స్‌కు అన్ని రకాలుగా సహకరిస్తామని హెచ్‌సీఏ స్పష్టం చేసింది. ఈ సమావేశానికి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు దూరంగా ఉన్నారు. నిర్దేశిత 10 శాతం పాస్‌లు కాకుండా అదనంగా పాస్‌లు ఇవ్వాలని బెదిరించడంతో పాటు అనేక రకాలుగా తమను హెచ్‌సీఏ అధ్యక్షుడు ఇబ్బంది పెడుతున్నారని హెచ్‌సీఏ కోశాధికారికి సన్‌రైజర్స్ లేఖ రాయడం.. దీనిపై స్పందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్‌సీఏ వ్యవహారాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించడం తెలిసిందే.




# మెరిసిన ప్రభ్‌సిమ్రన్

# లఖ్‌నవూపై ఘనవిజయం




లఖ్‌నవూ: ఐపీఎల్-18లో పంజాబ్ కింగ్స్ వరుసగా రెండో విజయాన్నందుకుంది. మంగళవారం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆ జట్టు 8 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌ను చిత్తుగా ఓడించింది. మొదట లఖ్‌నవూ 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. పూరన్ (44బీ 30 బంతుల్లో 5ఐ4, 2ఐ6), బదోని (41బీ 33 బంతుల్లో 1ఐ4, 3ఐ6) రాణించారు. అర్ష్‌దీప్ (3/43), యాన్సెన్ (1/28), చాహల్ (1/36), మ్యాక్స్‌వెల్ (1/22), ఫెర్గూసన్ (1/26) లఖ్‌నవూను కట్టడి చేశారు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69బీ 34 బంతుల్లో 9ఐ4, 3ఐ6), శ్రేయస్ అయ్యర్ (52 నాటౌట్‌బీ 30 బంతుల్లో 3ఐ4, 4ఐ6), నేహాల్ వధేరా (43 నాటౌట్‌బీ 25 బంతుల్లో 3ఐ4, 4ఐ6) విరుచుకుపడడంతో లక్ష్యాన్ని పంజాబ్ 16.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.


**ఛేదన.. చెమటపట్టకుండా:** లఖ్‌నవూ కష్టపడ్డ అదే పిచ్‌పై ఛేదనలో పంజాబ్ చెలరేగిపోయింది. విధ్వంసక విన్యాసాలతో సునాయసంగా విజయాన్నందుకుంది. ఓపెనర్ ఆర్య (8) త్వరగా నిష్క్రమించినా.. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ చెలరేగిపోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. మరోవైపు శ్రేయస్ నిలవగా.. ప్రభ్‌సిమ్రన్ ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదేశాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6 కొట్టాడు. పవర్ ప్లే ముగిసేసరికి పంజాబ్ 62/1తో నిలిచింది. శ్రేయస్ కూడా జోరందుకోవడంతో లఖ్‌నవూ బౌలర్లకు ఉపశమనమే లేకపోయింది. ప్రభ్‌సిమ్రన్ 23 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేయగా.. పదో ఓవర్లోనే పంజాబ్ స్కోరు వంద దాటింది. తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ ఔటైనా.. క్రీజులోకి వచ్చిన నేహాల్ మరింతగా రెచ్చిపోవడంతో పంజాబ్ వడివడిగా లక్ష్యం దిశగా సాగింది. నేహాల్... బిష్ణోయ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్.. శార్దూల్ బౌలింగ్‌లో వరుసగా 6, 6, 4 దంచేశాడు. మరోవైపు శ్రేయస్ కూడా జోరు కొనసాగించాడు. సమద్ బౌలింగ్‌లో సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు. శ్రేయస్-నేహాల్ జంట అభేద్యమైన మూడో వికెట్‌కు 37 బంతుల్లోనే 67 పరుగులు జోడించింది. ఛేదనలో పంజాబ్ తిరుగులేని ఆదిపత్యాన్ని ప్రదర్శించినా.. ఆ జట్టు విధ్వంసకారుడు ప్రభ్‌సిమ్రన్‌ను లఖ్‌నవూ ఫీల్డర్లు క్యాచ్ ఔట్‌తో వెనక్కి పంపిన తీరు ఆకట్టుకుంది. రాఠీ ఆఫ్‌స్టంప్ ఆవల వేసిన బంతిని ప్రభ్‌సిమ్రన్ డీప్ మిడ్‌వికెట్లోకి భారీ షాట్ ఆడగా.. బౌండరీ లైన్ వద్ద బదోని క్యాచ్ అందుకున్నాడు. కానీ నియంత్రించుకోవడం కష్టమని గ్రహించి.. బయట కాలు పెట్టే లోపు బంతిని లోపలికి గాల్లోకి విసిరాడు. అప్పటికే డీప్‌స్క్వేర్ లెగ్ నుంచి అక్కడి వచ్చిన బిష్ణోయ్.. ముందుకు దూకుతూ కళ్లు చెదిరే రీతిలో బంతిని అందుకున్నాడు.

**లఖ్‌నవూ కట్టడి:** మొదట పవర్ ప్లేలో అద్భుత బౌలింగ్‌తో పంజాబ్ మంచి ఫలితాన్ని రాబట్టింది. లఖ్‌నవూను కట్టడి చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఆరంభమే పెద్ద షాక్. ఆరు ఓవర్లు ముగిసే సరికి ఆ జట్టు 39 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్.. తన బౌలర్లను చక్కగా ఉపయోగించుకున్నాడు. అతడి ఫీల్డింగ్ ఏర్పాటు కూడా బాగుంది. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడు తొలి ఓవర్లోనే మార్ష్‌ను ఔట్ చేయడం ద్వారా అతడు లఖ్‌నవూ పతనాన్ని ఆరంభించగా.. ధాటైన బ్యాటింగ్‌తో జోరు మీద కనిపించిన మార్‌క్రమ్ (28బీ 18 బంతుల్లో 4ఐ4, 1ఐ6)ను ఫెర్గూసన్ వెనక్కి పంపాడు. కెప్టెన్ పంత్ (2))ను చాహల్ నిలువనివ్వలేదు. పంత్ వరుసగా మూడో మ్యాచ్‌లో విఫలమయ్యాడు. అయితే కష్టాల్లో ఉన్న జట్టును పూరన్ ఆదుకున్నాడు. వికెట్లు చకచకా పడ్డ నేపథ్యంలో మొదట్లో జాగ్రత్తగా ఆడిన అతడు.. క్రమంగా బ్యాట్ ఝుళిపించాడు. చాహల్ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్.. స్టాయినిస్ ఓవర్లో వరుసగా 6, 4 బాదేశాడు. కానీ 12వ ఓవర్లో చాహల్ అతణ్ని వెనక్కి పంపడంతో 54 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. బదోని, మిల్లర్ (19) నిలిచినా.. వేగంగా పరుగులు రాలేదు. మిల్లర్ స్ట్రైక్ రొటేట్ చేయలేకపోయాడు .16వ ఓవర్లో అతడు నిష్క్రమించేటప్పటికి లఖ్‌నవూ స్కోరు 117. ఆఖర్లో సమద్ (27బీ 12 బంతుల్లో 2ఐ4, 2ఐ6) మెరవడంతో ఆ జట్టు స్కోరు 170 దాటింది. బదోని, సమద్ జంట 21 బంతుల్లోనే 47 పరుగులు జోడించింది. 18వ ఓవర్లో అర్ష్‌దీప్ 20 పరుగులు సమర్పించుకున్నాడు. అయితే ఆఖరి రెండు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయిన లఖ్‌నవూ.. కేవలం 15 పరుగులే చేయగలిగింది.



# శ్రేయస్‌కు మళ్లీ బీసీసీఐ కాంట్రాక్ట్!

ముంబయి: టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తిరిగి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కనుందని సమాచారం. శ్రేయస్ దేశవాళీ క్రికెట్ ఆడనందుకు ఆగ్రహించిన బోర్డు.. నిరుడు అతడికి కాంట్రాక్ట్ ఇవ్వని సంగతి తెలిసిందే. ఇషాన్ కిషన్ కూడా అదే కారణంతో కాంట్రాక్ట్ కోల్పోయాడు. ఆ తర్వాత తిరిగి వన్డే జట్టులో స్థానం సంపాదించిన శ్రేయస్.. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అయిదు మ్యాచ్‌ల్లో 243 పరుగులు చేశాడు. దేశవాళీ క్రికెట్లోనూ అతడు విశేషంగా రాణించాడు. ఈ రంజీ సీజన్లో అయిదు మ్యాచ్‌ల్లో శ్రేయస్ 68.57 సగటుతో 480 పరుగులు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీలో 345 పరుగులతో నాలుగో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. విజయ్ హజారే ట్రోఫీలో అయిదు మ్యాచ్‌ల్లో 325 పరుగులు చేశాడు. సగటు 325 కావడం విశేషం. ఈ నేపథ్యంలో శ్రేయస్‌కు తిరిగి సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కనుందని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. ఇషాన్ కిషన్‌కు మాత్రం కాంట్రాక్ట్ సందేహమే అని సమాచారం. టీ20 క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలను ఎం గ్రేడ్‌లో కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా మూడు ఫార్మాట్లలో ఆడే ఆటగాళ్లకు ఎం గ్రేడ్ (రూ.7 కోట్లు) ఇస్తారు. నిరుడు కోహ్లి, రోహిత్‌తో పాటు జడేజా, బుమ్రాలకు మాత్రమే ఆ గ్రేడ్ కాంట్రాక్ట్ లభించింది.



# వచ్చే వన్డే ప్రపంచకప్ గెలవడమే నా లక్ష్యం

దిల్లీ: టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కనీసం 2027 వరకు క్రికెట్లో కొనసాగాలనుకుంటున్నాడు. వచ్చే వన్డే ప్రపంచకప్ గెలవడమే తన తదుపరి లక్ష్యమని కోహ్లి పేర్కొన్నాడు. ఓ కార్యక్రమం సందర్భంగా తన తదుపరి లక్ష్యంపై కోహ్లి స్పందించాడు. "తర్వాతి లక్ష్యం ఏంటో తెలియదు. బహుశా 2027 ప్రపంచకప్ గెలవడం కావొచ్చు" అని అన్నాడు. తర్వాతి వన్డే ప్రపంచకప్ 2027లో దక్షిణాఫ్రికాలో జరుగుతుంది. 2023లో స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిదే. అయితే 765 పరుగులతో కోహ్లి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'గా నిలిచాడు. అయినా జట్టు ఓడిపోవడంతో అతడికి నిరాశ తప్పలేదు. అప్పటి నుంచి కోహ్లి, రోహిత్ వచ్చే వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగడంపై ఊహాగానాలు సాగుతున్నాయి.



# పవర్ ప్లేలో అశ్విన్‌తో బౌలింగ్ చేయించకండి

## భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్

గతేడాది అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్.. ఈ ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడుతున్నాడు. అశ్విన్ దాదాపు 12 ఏళ్ల తర్వాత తిరిగి సొంత గూటికి చేరుకున్నాడు. ఒకప్పుడు తన స్పిన్ మయాజాలంతో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు చుక్కలు చూపించిన యాష్.. ఇప్పుడు పెద్దగా రాణించట్లేదు. భారీగా పరుగులు ఇవ్వడంతోపాటు వికెట్లూ తీయడం లేదు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి 10 ఓవర్లు వేసిన అతను 9.90 ఎకానమీతో మూడు వికెట్లు తీశాడు. మరోవైపు, తొలి మ్యాచ్‌లో ముంబయిపై గెలిచిన చెన్నై.. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. ఈ నేపథ్యంలో సీఎస్కేకు భారత మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ పలు సూచనలు చేశాడు. పవర్ ప్లేలో అశ్విన్‌తో బౌలింగ్ చేయించొద్దని సూచించాడు. జట్టులో కొన్ని మార్పులు చేస్తే జట్టు తిరిగి గాడిలో పడుతుందన్నాడు.

'అశ్విన్‌ను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించొద్దు. కానీ, పవర్ ప్లేలో అతడితో బౌలింగ్ చేయించడం ఆపండి. రవీంద్ర జడేజా, నూర్ అహ్మద్‌తో కలిసి 7-18 ఓవర్ల మధ్య అశ్విన్ ప్రభావం చూపించగలడు. రాహుల్ త్రిపాఠిని తప్పించి అన్షుల్ కాంబోజ్‌కు అవకాశం ఇవ్వాలి. ఒవర్టన్ స్థానంలో దేవాన్ కాన్వేను తుది జట్టులోకి తీసుకోవాలి. శివమ్ దూబె ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండాలి. ఆండ్రీ సిద్ధార్థ్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించాలి. పేసర్ ముకేశ్ చౌదరి కూడా మంచి ఆప్షన్. అతను గతంలో సీఎస్కే తరఫున బాగా బౌలింగ్ చేశాడు' అని కృష్ణమాచారి శ్రీకాంత్ వివరించాడు. చెన్నై తదుపరి మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. ఏప్రిల్ 5న చెపాక్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.



# మరక మాయం..

అప్లై మొక్కజొన్న పిండి.. కార్న్ స్టార్చ్.. దీనిని మనం ఇంట్లో ఎన్నో రకాలుగా వాడొచ్చు. అవేంటో తెలుసుకోండి. బట్టలపై నూనె పడందా.. ఇది అప్లై చేస్తే మరక మాయం.. వంటల దగ్గర్నుంచి ఇంట్లో ఎన్నో పనుల వరకూ కార్న్ స్టార్చ్‌ని చాలా విధాలుగా వాడొచ్చు. కూరలు, చైనీస్ వంటల్లో గ్రేవీ చిక్కగా రావడానికి మనం మొక్కజొన్న పిండిని వాడతాం. కొన్ని స్నాక్స్ క్రిస్పీగా రావడానికి కూడా వీటిని వాడొచ్చు. అదే విధంగా ఇంట్లోని వస్తువులని క్లీన్ చేయడానికి కూడా ఈ కార్న్ స్టార్చ్‌ని వాడొచ్చు. స్ప్రే చేయడం.. అదే పెద్ద గిన్నెలోరెండు కప్పులు గోరువెచ్చని నీరు పోసి దానికి ఓ టేబుల్ స్పూన్ కార్న్ స్టార్చ్, ఓ టేబుల్ స్పూన్ వెనిగర్ వేసి బాగా కలపండి. వీటిని వస్తువులపై స్ప్రే చేసి తర్వాత పేపర్ టవల్‌తో క్లీన్ చేయండి.





అలానే ఈ పేస్టుతో గాజు వస్తువులు, తలుపులు, గ్లాసులు వంటి వాటిని కూడా క్లీన్ చేయొచ్చు. దీంతో అవి కొత్తవాటిలా మెరుస్తాయి. రెగ్యులర్‌గా కాకపోయినా నెలకి ఓ సారైనా క్లీన్ చేయడం మంచిది. ఈ పిండిని క్లీన్ చేయడం వల్ల వెండి వస్తువులు కొత్తగా తళతళ మెరుస్తాయి. అందుకోసం 1 టేబుల్ స్పూన్ కార్న్ స్టార్చ్ తీసుకుని దానికి 2 టేబుల్ స్పూన్ల నీరు తీసుకుని క్రీమ్‌లా చేయాలి. దీనిని వెండి వస్తువుల మీద వేసి కాసేపు ఉంచి ఆ తర్వాత చక్కగా ఓ గుడ్డతో క్లీన్ చేయాలి. ఆ తర్వాత అవి చక్కగా మెరుస్తాయి. నూనె పడిన ప్రాంతంలో పిండిని చల్లండి. దానిని అలానే 12 గంటల పాటు అలానే ఉంచండి. ఇప్పుడే ఈ పిండి బట్టల్లోని నూనెని పీల్చుకుంటుంది. తర్వాత ఈ బట్టలని నీటితో వాష్ చేసి ఎండలో ఆరేస్తే చాలా వరకూ మరక పోతుంది. కొన్నిసార్లు బట్టలపై అనుకోకుండా నూనె పడుతుంది. ఇవి ఎంతగా డిటర్జెంట్‌తో క్లీన్ చేసినా పోవు. అలాంటప్పుడు ఈ కార్న్ స్టార్చ్ సమస్యని ఈజీగా దూరం చేస్తుంది. ఆయిల్ మరకలే కాదు.. బట్టలపై పడిన ఎలాంటి మరకలైనా ఈ పేస్ట్ మాయం చేస్తుంది. నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం.





# కొత్త చెప్పులు కరుస్తున్నాయా..?

కొత్త చెప్పులు వేసుకుంటే.. చాలామంది కాళ్లు కరుస్తుంటాయి. దీని కారణంగా వాళ్లు సౌకర్యవంతంగా నడవలేరు, కాళ్లు బొబ్బలు కూడా వస్తుంటాయి. కొత్త చెప్పులు కాళ్లను కరవకుండా కొన్ని టిప్స్ సహాయపడతాయి.

కొత్త చెప్పులంటే.. ఎవరికి ఇష్టం ఉండదు. అమ్మాయిలైతే.. పార్టీవేర్, ఆఫీస్ వేర్, ఫ్లాట్స్, హీల్స్, షూస్.. ఇలా రకరకాల పాదరక్షకలు వాడుతుంటారు. కొత్తచెప్పులు చూడటానికి బాగానే ఉంటాయిగానీ.. వేసుకుంటేనే కాస్త ఇబ్బంది పెడుతుంటాయి. అలవాటయ్యే వరకు.. మన పాదాలకు రాసుకుంటాయి. దాంతో చిన్న గాయం లేదా దద్దుర్లు ఏర్పడతాయి. చెప్పులు కాళ్లను కరుస్తుంటే.. చాలా ఇబ్బందిగా ఉంటుంది, సౌకర్యవంతంగా నడవలేం కూడా. అంతేకాదు, కొన్ని సార్లు చెప్పులు వదులుగా ఉంటాయి. కొత్త చెప్పులు కరవకుండా, వదలైన చెప్పులు సౌకర్యవంతంగా వేసుకోవడానికి.. ఎలాంటి టిప్స్ ఫాలో కావాలో ఈ స్టోరీలో చూద్దాం. అతేకాదు, చెప్పులు కరచిన గాయాలను తగ్గించాలో కూడా తెలుసుకుందాం.




కొత్త చెప్పులు వేసుకున్నప్పుడు.. కాళ్లకు డియోడరెంట్ లేదా హెయిర్ సీరమ్ అప్లై చేయండి. ఇలా చేస్తే.. పాదాలు, పాదరక్షలకు మధ్య రాపిడి తగ్గుతుంది. దీంతో మీరు సౌకర్యవంతంగా నడవచ్చు. మీరు కొత్త చెప్పులు వేసుకునే ముందు పాదాలకు కొబ్బరి నూనె లేదా పెట్రోలియం జెల్లీ అప్లై చేసుకోండి. ఇలా చేస్తే.. చెప్పులు కాళ్లను కరవకుండా ఉంటాయి. ఒరుసుకుంటున్న చోట బ్యాండెయిడ్ లేదా సర్జికల్ టేప్ వేయండి. వీటిలోనూ ట్రాన్స్‌పరెంట్ రకాలు ఉంటాయి. వాటిని వేసుకుంటే కనిపించవు, పైగా సౌకర్యవంతంగా ఉంటాయి. కొత్త షూల్లో బేబీ పౌడర్‌ని బాగా చల్లి ఆపై వేసుకున్నా బొబ్బల పడవు. కొత్త చెప్పులు వేసుకున్నప్పుడు.. న్యూడ్ కలర్ సాక్స్‌లు వేసుకోండి. ఇలా చేస్తే.. చెప్పులు కాళ్లను కరవకుండా ఉంటాయి. చాలామంది ఎత్తు మడమల చెప్పులు వేసుకున్నప్పుడో, కాస్త వదులుగా ఉన్న చెప్పులూ, కొత్త బూట్లతో నడుస్తున్నప్పుడో చాలా ఇబ్బంది పడుతుంటారు. ఆ సమస్యల్ని తగ్గించుకోవాలంటే 'హీల్ గ్రిప్స్, హై హీల్ ప్యాడ్స్ ఉంటాయి. ఇవి వేసుకుంటే.. సౌకర్యవంతంగా నడవచ్చు.





నొప్పిని, బొబ్బలు ఇలా తగ్గించండి..

చెప్పులు కరచిన వద్ద.. ఒక వస్త్రంలో ఐస్ క్యూబ్స్ వేసి కాపడం పెట్టండి. ఇలా చేస్తే నొప్పి, వాపు తగ్గుతాయి. చెప్పులు కరిచిన చోట, బొబ్బలు ఏర్పడి చోట కలబంద గుజ్జు అప్లై చేయండి. కలబందలో యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పి, మంటను తగ్గిస్తాయి. ఆలివ్ నూనె, బాదం నూనెను రెండింటిని సమాన భాగాలలో తీసుకోని మిక్స్ చేయండి. ఈ నూనెను చెప్పులు కరచిన చోట అప్లై చేయండి.



# వాటర్ బాటిల్స్ వాసన వస్తున్నాయా..

కొన్నిసార్లు వాటర్ బాటిల్స్ ఎంత క్లీన్ చేసినా ఆ వాసన పోదు. అలాంటప్పుడు కొన్ని టిప్స్ హెల్ప్ చేస్తాయి. ఎంత కడిగినా వాటర్ బాటిల్స్ వాసన వస్తున్నాయా.. ఇలా చేయండి.. ఏ కాలమైనా వాటర్ ఎక్కువగా తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ వాటర్‌ని మనం ఎక్కువగా బాటిల్స్‌లో క్యారీ చేస్తాం. అయితే, వీటిని ఎక్కువ రోజులు వాడడం వల్ల అదో రకమైన వాసన వస్తుంటుంది. ఎంత క్లీన్ చేసినా ఆ వాసన పోదు. అలాంటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అయితే ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుంది. అవేంటో తెలుసుకోండి. గిన్నెల్లోని వాసనని పోగొట్టేందుకు టీ, కాఫీ పౌడర్ బాగా హెల్ప్ చేస్తుంది. దీని కోసం టీ పొడితో డికాషన్ తయారు చేయాలి. దీనిని బాటిల్స్‌లో వేసి బాగా షేక్ చేయాలి. ఇది బాటిల్స్‌లోని వాసనని దూరం చేస్తుంది.



నిమ్మరసం.. నిమ్మరసంలో గుణాలు దుర్వాసనలు పోగొట్టేందుకు హెల్ప్ చేస్తుంది. దీని కోసం ముందుగా నిమ్మరసం తీసుకుని బాటిల్‌లో వేయండి. తర్వాత నీరు పోయండి. బాగా షేక్ చేయండి. దీని వల్ల చాలా వరకూ వాసన తగ్గుతుంది. దీని బదులు నారింజ తొక్కలు కూడా వేసి ఇలా చేయొచ్చు.



బేకింగ్ సోడా.. బేకింగ్ సోడా కూడా బాటిల్స్‌లోని మురికి, వాసనని దూరం చేస్తాయి. ఓ టీ స్పూన్ బేకింగ్ సోడాని తీసుకోండి. దానిని బాటిల్‌లో వేసి నిండా నీరు నింపు ఓ రోజంతా అలానే ఉంచండి. తర్వాత రోజు ఆ బాటిల్‌ని చక్కగా క్లీన్ చేయాలి. దీని వల్ల వాసన తగ్గుతుంది. సబ్బుతో క్లీన్ చేయడం.. చాలా మంది బాటిల్‌ని సరిగ్గా కడగాలి. ముందుగా సబ్బుతో వారానికి ఓ సారైనా క్లీన్ చేయాలి. ఇలా కడిగాక నీటిని అంతా చక్కగా తుడిచేసి కాసేపు ఎండలో పెట్టాలి.



నోటికి తగలకుండా.. నీరు తాగేటప్పుడు కొంతమందికి నోటికి దగ్గరగా పెట్టి తాగితే మరికొంతమంది నోటికి దూరంగా పెట్టి తాగుతారు. దగ్గరికి పెట్టిన వారు రోజు ఆ బాటిల్‌ని క్లీన్ చేయాలి. లేకపోతే వాసన వస్తుంది.

# ఈ క్రీమ్‌తో మీ స్కిన్ మెరవడం ఖాయం

ఇంట్లోనే తయారు చేసే ఈ క్రీమ్‌తో మీ స్కిన్ కొరియన్స్‌లా మెరవడం ఖాయం

కొరియన్స్ స్కిన్ అనేది అందరికీ చాలా ఇష్టం. ఇందుకోసం కాస్టీ క్రీమ్స్ మాత్రమే కాదు. కొన్ని టిప్స్ కూడా హెల్ప్ చేస్తాయి. అందులో భాగంగా రైస్ క్రీమ్ గురించి తెలుసుకుందాం. కొరియన్స్.. వారి స్కిన్, హెయిర్ కేర్.. మొత్తంగా బ్యూటీ కేర్‌లో రైస్‌ని ఎన్నో విధాలుగా వాడతారు. వీటిని వాడడం వల్ల గ్లాసీ స్కిన్ కనిపించడమే కాదు. హెయిర్ కూడా చాలా బావుంటుంది. అందుకోసం కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. ముఖ్యంగా స్కిన్‌ని మెరిపించేందుకు బియ్యంతో ఓ క్రీమ్ తయారు చేయొచ్చు. అదెలానో ఇప్పుడు చూద్దాం.





ముందుగా ఓ కప్పు బియ్యం తీసుకోండి. వీటిని ఓ రెండు సార్లు కడిగి నీటిలో వేసి నానబెట్టండి. అరగంటసేపు నానబెట్టాలి. నానబెట్టిన బియ్యాన్ని చక్కగా అన్నంలా వండుకోవాలి. మెత్తగా వండాలి. 1 కప్పు బియ్యానికి 2 కపులకి పైగానే నీరు పోసి మెత్తగా ఉడికించండి. ఆరబెట్టండి.. దీనిని ఓ గిన్నెలో వేసి ఆరబెట్టండి. ఆరిన అన్నాన్ని మిక్సీ జార్‌లో వేసి మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. పేస్టులా చేయాలి. ఇందులో నీరు వేసి జ్యూస్‌లా చేయాలి. దీనిని వడకట్టాలి. మొత్తం పేస్టులా ఉండాలి. స్కిన్‌పై రాసినా ఎలాంటి ఇరిటేషన్ ఉండకుండా చూసుకోవాలి.





తేనె, ఆలివ్ ఆయిల్.. ఇప్పుడు అందులోనే ఓ చెంచా తేనె వేసి బాగా కలపండి. తేనెలో అద్భుత గుణాలు చర్మానికి ఎంతగానో మేలు చేస్తాయి. 5 నిమిషాల తర్వాత ఈ మిశ్రమంలో 2 స్పూన్ల ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. దీనిని చక్కగా ఓ పేస్టులా చేయాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని ఓ కంటెయినర్‌లో పెట్టాలి. దీనిని మూడు రోజుల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. అంతే మీ క్రీమ్ రెడీ అయినట్లే. ముఖాన్ని శుభ్రంగా క్లీన్ చేయాలి. ఆరిన తర్వాత ముఖానికి ఈ క్రీమ్ అప్లై చేయండి. 20 నిమిషాల తర్వాత కడగండి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే ముఖంపై మెరుపు వస్తుంది. నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.



# షాంపూ చేయడానికి ముందు ఇలా చేస్తే



హెయిర్ కేర్ అనేది చాలా ముఖ్యం. అందులో షాంపూ చేయడం కూడా అంతే ముఖ్యం. షాంపూ చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవాలి. షాంపూ చేయడానికి ముందు ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.. ప్రతి ఒక్కరికి జుట్టు అందంగా, నల్లగా, ఒత్తుగా ఉండాలని కోరుకుంటారు. ప్రతి మనిషి శారీరక సౌందర్యంలో జుట్టు ముఖ్య పాత్ర పోషిస్తుంది. అందుకే జుట్టు కోసం చాలా కేర్ తీసుకుంటారు. పాటించాల్సిన టిప్స్.. హెల్దీ, బ్యూటీఫుల్ జుట్టు అనేది ప్రతి ఒక్కరి కాన్ఫిడెన్స్‌ని పెంచుతుంది. ఇందుకోసం ఖరీదైన సెలూన్స్‌కి వెళ్ళాల్సిన అవసరం లేదు. హెయిర్ కేర్ ప్రోడక్ట్స్ వాడాలి. అయితే, కొన్ని టిప్స్ పాటిస్తే మీ జుట్టుని అందంగా మార్చుకోవచ్చు.





అదే విధంగా తలస్నానం చేసే ముందుకు కొన్ని టిప్స్ పాటించాలి. ఇది మీ జుట్టుని అందంగా, మెరిసే లా చేస్తుంది. షాంపూ చేయడానికి ముందు జుట్టుకి నూనె రాయండి. దీని కారణంగా కుదుళ్ళకి నూనె పొరలా ఏర్పడి తేమని అందిస్తుంది. దీని వల్ల షాంపూలోని హానికరమైన ప్రభావాల నుండి కాపాడుతుంది. షాంపూ చేయడానికి ముందు, కొబ్బరి నూనె, ఆలివ్ నూనెతో జుట్టుని మసాజ్ చేయాలి. తర్వాత షాంపూ చేస్తే జుట్టు మెరుస్తుంది.

దువ్వడం.. షాంపూ చేయడానికి ముందు జుట్టులో ఎలాంటి చిక్కులు లేకుండా బాగా దువ్వండి. దీంతో షాంపూ జుట్టుని మెరుగ్గా చేస్తుంది. వెడల్పాటి పండ్ల దువ్వెనతో జుట్టుని బాగా దువ్వండి. ఇది షాంపూ చేసేటప్పుడు జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. గోరువెచ్చని నీరు.. షాంపూ చేయడానికి ముందు మీ జుట్టుని గోరువెచ్చని, చల్లని నీటితో జుట్టుని మొత్తం తడపండి. తర్వాత జుట్టుని కొద్దిగా స్క్వీజ్ చేయండి. సరైన మొత్తంలో షాంపూ.. జుట్టుకి సరైన మొత్తంలో షాంపూ వాడండి. ఎక్కువగా షాంపూ వేస్తే జుట్టు బలహీనమవుతుంది. మీరు షాంపూని వాడినప్పుడు దానిని గుండ్రంగా మసాజ్ చేయండి. తర్వాత షాంపూ నురగ మొత్తం పోయేలా నీటితో జుట్టుని క్లీన్ చేయండి.



# మగవారు ఈ విషయాలకి చాలా భయపడతారు..

ప్రతి ఒక్కరికీ జీవితంలో ఏదో విషయంలో అనుమానం ఉంటుంది. ముఖ్యంగా పురుషులకి అభద్రతా భావం ఉంటుంది. జీవితంలో మగవారు ఈ విషయాలకి చాలా భయపడతారు.. ఏ వ్యక్తికి అయినా కొన్ని విషయాల్లో కొన్ని ఇన్‌సెక్యూరిటీస్ ఉంటాయి. స్త్రీలే కాదు.. పురుషులకి ఈ విషయాల్లో కొద్దిగా భయం ఉంటుంది. పురుషులు తమ జీవితంలో చాలా విషయాల గురించి భయపడుతుం టారు. ఇది తీవ్రమైన సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ని తగ్గిస్తుంది. పురుషులు భయపడే కొన్ని విషయాల గురించి తెలుసుకోండి. అంచనాలు అందులేకపోవడం.. సాధారణంగా మగవారిపై చాలా ఎక్స్‌పెక్టేషన్స్ ఉంటాయి. వాటిని రీచ్ అవ్వడానికి చాలా కష్టపడతారు. అవి నెరవేరనప్పుడు వారి సెల్ఫ్ కాన్ఫిడెనన్స్‌ని దెబ్బతీస్తుంది. మగవారు తమ చుట్టూ ఉన్న వ్యక్తుల అంచనాలకు అనుగుణంగా జీవించాలి. అలా చేయలేనప్పుడు వారు ఓడిపోయినట్లుగా భావించి చాలా ఫీల్ అవుతారు. భావాలను వ్యక్తపరచడం.. ఆడవారు ఏవైనా తమ భావాలను ఈజీగా వ్యక్తపరుస్తారు. కానీ, మగవారు ఇందులో కాస్తా ఫెయిల్ అవుతారు. ఇలాంటి వాటిని ఎలా హ్యాండిల్ చేయాలో తెలియక చాలా టెన్షన్ పడుతారు. ఉద్యోగ భద్రత.. నేటి కాలంలో చాలా సంస్థలు ఉద్యోగులని తొలగిస్తున్నారు. ఈ పోటీ యుగంలో మగవారు తమ ఉద్యోగాల గురించి చాలా టెన్షన్ పడుతుంటారు. ఓ వ్యక్తి తన పని అనేది జీవితంలో చాలా ముఖ్యమైనది. ఉద్యోగంలో భద్రత లేకపోతే చాలా టెన్షన్ పడుతుంటారు. ఫిజికల్లీ.. ఆడవారు ఎలాగైతే మంచి ఫిజిక్ ఉండాలని కోరుకుంటారో.. మగవారు కూడా వేరేవారు ఇతరులలానే మంచి ఫిజిక్ ఉండాలని కోరుకుం టారు. కానీ, వారికి అలా లేకపోతే వారి సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తగ్గి భయపడుతుంటారు. సంబంధంలో ప్రేమ, నమ్మకం, విశ్వాసంలో ఉండాలి. లేకుంటే ఆ బంధానికి ద్రోహం చేసినట్టే. దంపతుల మధ్య ఇవి కరువైనప్పుడు వారి పార్టనర్ అభద్రతా భావంతో ఉంటాడు.









# షాపింగ్ చేసేటప్పుడు....

సరుకులు కొంటుంటారు. కొనేటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అప్పుడే ఐటెమ్స్, టైమ్ వేస్ట్ అవ్వదు. ప్రతి ఒక్కరికి ఇంటి సామాన్లు కొంటారు. వంట చేయడానికి కిరాణా సామాన్లు అవసరం. షాపింగ్ చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ బడ్జెట్ ప్రకారం షాపింగ్ చేస్తారు.

ఇంటికి కావాల్సిన వస్తువులు కొనేటప్పుడు బడ్జెట్ చూడడం చాలా ముఖ్యం. షాపింగ్ చేసేటప్పుడు ఇది చాలా ముఖ్యం.

వంట సామాగ్రి కొనేటప్పుడు, వారానికి ఓ సారి కిరాణా దుకాణానికి వెళ్ళి అవసరాన్ని బట్టి అన్ని వస్తువులు కొనాలి. నోట్‌ప్యాడ్‌లో పెట్టండి. అందులో మీకు ఏం కావాలి.. ఏమేం కొనాలి అనే వస్తువులని నోట్ చేసుకోండి. ఈ లిస్ట్‌లో అవసరమైన వస్తువులని తీసుకోవడంలో హెల్ప్ చేస్తుంది. సబ్బు, లిక్విడ్ లేకుండానే వీటితో గిన్నెలు క్లీన్ చేయొచ్చు.. లేబుల్స్ చెక్ చేయడం.. మీరు ఏవైనా వస్తువులు కొన్నప్పుడు లేబుల్స్ చెక్ చేయండి. ఈ లేబుల్స్‌పై ఆ వస్తువులకి సంబంధించిన ఇన్ఫర్మేషన్ మొత్తం ఉంటుంది. తయారైన డేట్, ఎక్స్‌పైరీ డేట్ వంటి ముఖ్య సమాచారం ఉంటుంది. ఇది చదివాకే కొనాలి. ఎక్స్‌పైర్ వస్తువులు కొంటే వాటిని తిన్నప్పుడు అలర్జీ వంటి సమస్యలు వస్తాయి. కొన్ని వస్తువులని ఎక్కువ రోజులు స్టోర్ చేయొద్దు. ఇవి త్వరగా పాడైపోతాయి. అలాంటి వాటిని తక్కువగా కొనాలి. పాలు, పెరుగు, పనీర్, వెన్న, పండ్లు, కూరగాయలు, బ్రెడ్, కేక్స్, కేకీలు ఇవన్నీ కూడా తక్కువగా కొనాలి. అప్పుడే అవి పాడవ్వకుండా ఉంటాయి. ఇలాంటి వస్తువులని ఎక్కువగా కొనొద్దు. ఎక్కువగా కొనండి.. అయితే, మీరు కొన్ని వస్తువులని ఎక్కువగా కొనొచ్చు. అవి షాంపూలు, బాడీ లోషన్స్, హ్యాండ్ వాష్ సబ్బులు, డిటర్జెంట్స్ ఇలాంటి వాటిపై చాలా సందర్భాల్లో ఆఫర్స్ ఉంటాయి. వీటిని కొనడం వల్ల తగ్గింపు ఉంటుంది. వీటిని ఎక్కువగా కొనొచ్చు. అయితే, కచ్చితంగా ఎక్స్‌పైరీ డేట్ చూసి కొనండి. ఇక ముఖ్యంగా మీరు షాపింగ్‌కి వెళ్ళినప్పుడు క్యారీ బ్యాగ్స్ తీసుకెళ్ళండి. క్లాత్ బ్యాగ్స్ వాడడం మంచిది. షాపుల్లో ప్లాస్టిక్ ఇస్తారు. వాటికి కూడా చార్జ్ చేస్తారు. ఈ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి నష్టం. అందుకే ఇవి కాకుండా క్లాత్ బ్యాగ్, జూట్ బ్యాగ్స్ వాడండి. దీని వల్ల డబ్బు ఆదాతో పాటు పర్యావరణానికి ఎలాంటి నష్టం ఉండదు. ఇలాంటి టిప్స్ పాటిస్తే మీ డబ్బుతో పాటు టైమ్ కూడా ఆదా అవుతుంది. ఎప్పుడైనా సరే అవసరమున్నవే తీసుకోవడం మంచిది. తక్కువ రేటుకి వస్తున్నాయి కదా అని అవసరం ఉన్నా లేకపోయినా తీసుకుంటారు. అలా ఎప్పుడు కూడా తీసుకోవద్దు. దీని వల్ల వాటిని వాడం. డబ్బు వేస్ట్ అవుతుందని గుర్తుపెట్టుకోండి.





# అల్లు అర్జున్ - త్రివిక్రమ్ మూవీ
## అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభం

'పుష్ప 2'లో తన మాస్ యాక్షన్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించారు అల్లు అర్జున్. ఈ చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో తర్వాత చేయనున్న సినిమాపై ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌పై తాజాగా నిర్మాత నాగవంశీ ఓ అప్‌డేట్ పంచుకున్నారు.

త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్నీ ఓ మూవీ చేయనున్న విషయం తెలిసిందే. ఇది పూర్తిగా మైథలాజికల్ జానర్ అని నాగవంశీ అన్నారు. సోషియో ఫాంటసీ చిత్రం కాదన్నారు. పురాణాల ఆధారంగానే అన్ని సన్నివేశాలు ఉంటాయన్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. ఇక ఈ సినిమాలో బన్నీ.. కుమారస్వామిగా కనిపించనున్నారంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. ఇప్పుడు నాగవంశీ కూడా మైథలాజికల్ జానర్ అని చెప్పడంతో బన్నీ లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎక్స్‌లోనూ ఈ హీరో కుమారస్వామిగా ఉన్న జీబ్లీ ఇమేజ్‌లు ట్రెండ్ అవుతున్నాయి.

# అజయ్ దేవగన్ మూవీలో ఐటమ్ సాంగ్...

మిల్కీ బ్యూటీ తమన్నా... ఐటమ్ సాంగ్ చేస్తే ఆ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయం అనే సెంటిమెంట్ దేశ వ్యాప్తంగా నెలకొంది. తమన్నా ఏ భాషా చిత్రంలో ఐటమ్ సాంగ్ చేసినా... అది హిట్ కావడం గ్యారంటీ. రజనీకాంత్ 'జైలర్'లోనూ, 'స్త్రీ – 2' సినిమాల్లోనూ తమన్నా చేసిన ఐటమ్ సాంగ్స్ ఆ మూవీ సక్సెస్ రేంజ్ ను పెంచేశాయి. దాంతో ఆమెతో ఒక్క సాంగ్ అయినా చేయించాలనే తాపత్రయం నిర్మాతలలో పెరిగిపోయింది.

తాజాగా తమన్నా భాటియా ఓ హిందీ సినిమాలో ఐటమ్ సాంగ్ కు రెడీ అయిపోయింది. అయితే... దీనిని ప్రమోషనల్ సాంగ్ గా మేకర్స్ ఉపయోగించుకో బోతున్నారు. అజయ్ దేవగన్ సరసన గతంలో 'హిమ్మత్ వాలా' హిందీ రీమేక్ లో నటించింది తమన్నా. మళ్ళీ ఇప్పుడు అజయ్ దేవ్ గన్ తాజా చిత్రం 'రైడ్ –2'లో ఆమె ఐటమ్ సాంగ్ చేయబోతోంది. ఈ పాటలో తమన్నాతో పాటు యో యో హనీసింగ్ కూడా నర్తించబోతున్నాడు. అలానే 'స్త్రీ –2' మూవీలోని తమన్నా ఐటమ్ సాంగ్ 'ఆజ్ కీ రాత్' కు కొరియోగ్రాఫర్ గా వ్యవహరించిన విజయ్ గంగూలీ దీనికి డాన్స్ మూమెంట్స్ కంపోజ్ చేస్తున్నాడు. ఇదే వారంలో రెండు రోజుల పాటు ముంబై స్టూడియో దీని చిత్రీకరణ జరుగబోతోంది. 'రైడ్ –2' మూవీలో అజయ్ దేవ్ గన్ ఐ.ఆర్.ఎస్. అధికారి అమయ్ పట్నాయక్‌గా నటించాడు. 2018లో వచ్చిన 'రైడ్' సినిమానే ఆ మధ్య రవితేజ 'మిస్టర్ బచ్చన్' పేరుతో రీమేక్ చేశాడు. ఇప్పుడీ 'రైడ్ –2' మే 1న విడుదల కాబోతోంది.





# 'కేజీయఫ్' స్థాయిలో 'కింగ్‌డమ్'..



ప్రెస్‌మీట్‌లో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' గురించి కూడా నాగవంశీ మాట్లాడారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రానున్న ఆ సినిమాలో యాక్షన్ సన్నివేశాలు 'కేజీయఫ్' స్థాయిలో ఉంటాయన్నారు. వాటికే అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆ సినిమాలో అన్ని లాజిక్‌లు ఉంటాయని.. సందేహాలన్నింటికీ గౌతమ్ తన వర్క్‌తో సమాధానమిస్తారని చెప్పారు. ఇది కచ్చితంగా హిట్ అవుతుందన్నారు. అలాగే రవితేజ హీరోగా తెరకెక్కుతున్న 'మాస్ జాతర' అనుకున్న సమయానికే రాకపోవచ్చని నాగవంశీ తెలిపారు. జులైలో ప్రేక్షకుల ముందుకు వస్తుందన్నారు.



# రియాలిటీ షోలు స్క్రిప్ట్‌లు కాదు..


ఓ ఇంటర్వ్యూలో మలైకా అరోరా రియాలిటీ షోల గురించి మాట్లాడారు. ఆ కార్యక్రమాలు మొత్తం స్క్రిప్ట్ ప్రకారం జరుగుతాయంటూ వస్తోన్న వార్తలపై స్పందించారు. కంటెస్టెంట్‌లు ప్రదర్శించే డ్యాన్స్ ఆధారంగానే జడ్జిమెంట్ ఇస్తామని పేర్కొన్నారు. "బయట నుంచి చూసే వారికి ఆ కార్యక్రమం మొత్తం స్క్రిప్ట్‌లా అనిపించడంలో తప్పులేదు.. ఎందుకంటే కొన్నిసార్లు డ్రామా ఆ స్థాయిలోనే ఉంటుంది. అక్కడ జరిగేవి ఒక్కోసారి న్యాయనిర్ణేతలకు చికాకు తెప్పిస్తాయి కూడా..! కానీ, ఆ పోటీలన్నీ న్యాయంగానే జరుగుతాయి" అని వెల్లడించారు.



# మెగా 157.. గ్యాంగ్ ఇదే!

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. 'మెగా 157' పేరుతో ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా కోసం వర్క్ చేయనున్న వారి వివరాలను పంచుకుంటూ టీమ్ ఓ ప్రత్యేక వీడియో విడుదల చేసింది. అందులో ఇప్పటి వరకూ చిరంజీవి నటించిన సినిమాల్లోని పాత్రలను చెబుతూ ఒక్కొక్కరు వారు చేయనున్న వర్క్‌ను వివరించారు. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. 'ఈ సంక్రాంతికి రఫ్ఫాడించేద్దాం' అంటూ వీడియో చివర్లో చిరంజీవి చెప్పిన డైలాగ్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.

# గంగూలీ బయోపిక్.. త్వరలోనే షూటింగ్ ప్రారంభం !



ప్రముఖ క్రికెటర్, టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ జీవితం త్వరలో వెండితెరపైకి రానున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ హీరో రాజ్‌కుమార్ రావు ఇందులో గంగూలీగా కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విక్రమాదిత్య మోత్వానే దర్శకత్వంలో రానున్న ఈ సినిమాను లవ్ రంజన్ నిర్మించనున్నారు. ఈ బయోపిక్‌ను భిన్నంగా రూపొందించాలని దర్శకనిర్మాతలు భావిస్తున్నారట. ప్రస్తుతం దీని ప్రీ–ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. తొలి షెడ్యూల్ రెండు నెలలు ఉంటుందని టాక్. ఇప్పటికే ఈ షెడ్యూల్‌కు సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాయని సమాచారం.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,